




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 28 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి మంగళవారం 10 ఫిబ్రవరి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 28 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI TUE 10 FEBRUARY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




తొలి ఎన్నికల బరిలో విజయ్..

## రెండు నియోజకవర్గాల నుంచి పోటీ!

- చెన్నైలోని విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలపై విజయ్ గురి
- పట్టణ, ప్రాంతీయ ఓటర్లను ఆకట్టుకునేందుకు పక్కా వ్యూహం
- రెండు స్థానాల్లోనూ అధికార డీఎంకేతోనే విజయ్ ప్రధాన పోటీ

- మిగతా 2లో...

# అమెరికాతో ఉద్రిక్తతలు..

## 37 ఏళ్ల సంప్రదాయానికి ఖమేనీ బ్రేక్

- 37 ఏళ్లలో తొలిసారి ఎయిర్‌ఫోర్స్ సమావేశానికి గైర్హాజరైన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ
- అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఈ అనూహ్య పరిణామం
- గల్ఫ్ ప్రాంతంలో భారీగా సైనిక బలగాలను మోహరిస్తున్న అమెరికా
- అమెరికా దాడి చేస్తే యుద్ధం తప్పదని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు

- మిగతా 2లో...



# ఉత్పత్తులకు బ్రాండింగ్, నాణ్యతే ముఖ్యం

- స్వయం సహాయక సంఘాల కోసం 'స్వయం' పేరుతో ప్రత్యేక బ్రాండ్
- రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్న సీఎం
- రూ.300 కోట్లతో ఎస్టీపీల నిర్మాణం వేగవంతం చేయాలని సూచన



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు మంత్రులు, కార్యదర్శులతో కీలక సమావేశం నిర్వహించారు. ఐదో బ్లాకులో జరిగిన ఈ సమావేశంలో ప్రొడక్ట్ పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, గ్రీన్ కవర్ వంటి పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. నాణ్యమైన ఉత్పత్తులకు సరైన బ్రాండింగ్ జోడిస్తేనే మెరుగైన మార్కెట్ సాధ్యమవుతుందని, ఈ దిశగా అధికారులు దృష్టి సారించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల కోసం 'స్వయం' అనే పేరుతో ప్రత్యేక బ్రాండ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బ్రాండ్ ద్వారా వారి ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్ అందుబాటులోకి వస్తుందన్నారు. అరకు కాఫీ తరహాలోనే కోకో పంటకు కూడా మంచి బ్రాండ్ తీసుకురావాలని సూచించారు.పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలని ఆదేశించారు. నగరాల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్టీపీ) నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ చేపట్టాలన్నారు. రూ.300 కోట్ల వ్యయంతో ఈ ప్లాంట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, దీనికి అవసరమైన నిధులను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) సమకూరుస్తుందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో పేరుకుపోయిన చెత్తను (లెగసీ వేస్ట్) వేగంగా తొలగించాలని స్పష్టం చేశారు.

### 50శాతం పచ్చదనమే లక్ష్యం


రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఉగాది నుంచి పాఠశాలల్లో దేశీయ వృక్ష జాతుల పెంపకంపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. తీరప్రాంత కోత నివారణకు ఉపముఖ్యమంత్రి చేపట్టిన ప్రాజెక్టును అభినందించిన సీఎం, కోతను అరికట్టడంతో పాటు రైతులకు ఆదాయం అందించేలా ఆర్కిడ్స్ సాగును ప్రోత్సహించాలని సూచించారు.



## అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు.. అయినా జైలుకే!

- సీఎంపై వ్యాఖ్యల కేసులో అంబటి రాంబాబుకు బెయిల్
- విడుదలవుతున్న సమయంలోనే మరో కేసు తెరపైకి
- పోలీసులతో దురుసు ప్రవర్తన కేసులో 14 రోజుల రిమాండ్
- ఈ నెల 22 వరకు అంబటికి జ్యుడీషియల్ కస్టడీ
- తిరిగి రాజమహేంద్రవరం జైలుకే అంబటి

- మిగతా 2లో...



స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసానికి

## విపక్షాల ప్లాన్..

ముదురుతున్న లోక్‌సభ వివాదం

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన విపక్షాలు
- ప్రధానిపై దాడి జరగొచ్చన్న స్పీకర్ వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం
- 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్‌తో మరింత పెరిగిన రాజకీయ వేడి

2లో...

పెన్ పవర్ డెస్క్: కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య తీవ్రమవుతున్న విభేదాల నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస



'పరీక్షా పే చర్చ'లో దేశ నిర్మాణంపై

## విద్యార్థులకు మోదీ పాఠాలు

- వికసిత భారత్ గురించి విద్యార్థులు ఆలోచించడంపై ప్రధాని మోదీ హర్షం
- అన్నం వృథా చేయకపోవడం దేశ నిర్మాణంలో భాగమేనని సూచన
- విజయానికి క్రమశిక్షణే పునాది అని విద్యార్థులకు ప్రధాని స్పష్టీకరణ
- 'పరీక్షా పే చర్చ'లో విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని మోదీ

- మిగతా 2లో...

పంజాబ్ సీఎం విదేశీ పర్యటనకు

## అనుమతినివ్వని కేంద్రం

- వివాదంగా మారిన పొలిటికల్ క్లియరెన్స్ నిబంధన
- సీఎంల ఫారిన్ టూర్లకు విదేశాంగ శాఖ అనుమతి తప్పనిసరి
- కక్ష సాధింపు చర్యలంటూ కేంద్రంపై ఆప్ మండిపాటు

పెన్ పవర్ డెస్క్:పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ విదేశీ పర్యటనపై కేంద్ర ప్రభుత్వం మరోసారి నీళ్లు చల్లింది. యూరప్ లో పర్యటించేందుకు మాన్ విదేశాంగ శాఖ అనుమతి కోరగా తిరస్కరించింది. దీంతో ముఖ్యమంత్రి మాన్

- మిగతా 2లో...





## ఎంఐఎం మద్దతు లేకుండా కాంగ్రెస్ గెలిచిందా?

- రెడ్లు అయినా, రావులు అయినా తమ దగ్గరకు రావాల్సిందే అన్న ఒవైసీ
- మున్సిపల్ ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపుతామని వ్యాఖ్య
- ముఖ్యమంత్రులే తమ దగ్గరకు రావాలన్న ఒవైసీ

పెన్ పవర్ డెస్క్: రెడ్లు అయినా, రావులు అయినా తమ దగ్గరకు రావాల్సిందేనని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రుల దగ్గరకు తాము వెళ్లమని, వాళ్లే తమ దగ్గరకు రావాలని అన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎంఐఎం మద్దతు లేకుండానే కాంగ్రెస్ గెలిచిందా?

- మిగతా 2లో...

ఏపీలో నియోజకవర్గాలకు ర్యాంకులు..

## ఎమ్మెల్యేల పనితీరుకు మార్కులు..



- ఏపీలో 175 నియోజకవర్గాల పనితీరుపై ప్రభుత్వ ర్యాంకులు
- 93 శాతం మార్కులతో ప్రథమ స్థానంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం
- రెండో స్థానంలో నిలిచిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నియోజకవర్గం గాజువాక
- AG గ్రేడులో 21, A గ్రేడులో 153, B గ్రేడులో ఒకే ఒక్క నియోజకవర్గం
- ఎమ్మెల్యేల పనితీరు, పథకాల అమలు ఆధారంగా ర్యాంకుల కేటాయింపు

- మిగతా 2లో...




## సుప్రీం తీర్పు: టీచర్స్‌పై ప్రభావం

2011 కంటే ముందు ఉపాధ్యాయులుగా చేరిన వారికి రెండు సంవత్సరాల లోపు టెట్ పరీక్షను ఉత్తీర్ణత సాధించాలని లేకుంటే ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వస్తుందని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి, మానసిక సంఘర్షణకు గురవుతున్నారు. తెలంగాణ లోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, ఎయిడెడ్, ఇతర పాఠశాలలలో పనిచేసే టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్)తో భయాందోళనకు గురవుతున్నారు. సుప్రీంకోర్టు 31 ఆగస్టు, 2025 న ప్రతి ఒక్క టీచర్ టెట్ ఉత్తీర్ణత సాధించాలని లేదా ఉద్యోగం వదులుకోవాల్సి వస్తుందని ఉత్తర్వులు జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ రకమైన విధానం అనుసరిస్తుందో అని టీచర్స్ ఎదురుచూస్తున్నారు. 2009లో విద్యా కమిషన్ వచ్చిన తర్వాత 2010 నుండి టెట్ అమలులోకి వచ్చింది. టెట్ అమలులోకి వచ్చిన తరువాత 2012, 2017, 2024 మూడుసార్లు టీచర్స్ రిక్రూట్‌మెంట్ జరిగింది. టెట్ వారికి అమలులోకి వచ్చింది. అంతకు ముందు జరిగిన టీచర్స్ రిక్రూట్‌మెంట్‌లో టెట్ అమలులో లేదు. సుప్రీంకోర్టు తీర్పులో ఐదు సంవత్సరాల లోపు పదవీ విరమణకు దగ్గర ఉన్న వాళ్ళకు మినహాయింపు ఇచ్చారు. 1996 నుండి టీచర్స్‌గా ఉన్న వాళ్ళకు, 30 సంవత్సరాలు కావస్తున్న 50 సంవత్సరాలు దాటిన వాళ్ళు అనేక మంది ఉన్నారు. వాళ్ళలో కంటి చూపు, మోకాళ్ళనొప్పులు, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్న వాళ్ళు అనేక మంది ఉన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారికి మినహాయింపు ఇవ్వడం కనీస న్యాయం. ప్రధానోపాధ్యాయ పదోన్నతిలో 50 సంవత్సరాలు దాటిన వారికి డిపార్ట్‌మెంట్ పరీక్ష నుండి మినహాయింపు ఉంది. 2024 సంవత్సరంలో ఎన్‌సిటిఇ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివరణ కోరితే 2010 కంటే ముందు టీచర్స్‌కు టెట్ అవసరం లేదని వివరణ ఇచ్చారు. ప్రస్తుతం సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు 30 నుండి 40 వేల మంది టీచర్స్‌పై ప్రభావం పడుతుంది. భాషోపాధ్యాయులు ఉర్దూ, కన్నడ ఇతర దేశ భాషలలో బోధించే ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్‌లో పేపర్ 3 నిర్వహిస్తున్నారు. తెలంగాణలో భాషోపాధ్యాయులకు సాంఘిక శాస్త్రం 60 మార్కులకు కేటాయించడం వలన అనేక మంది తెలుగులో ఉత్తీర్ణత సాధించడం లేదు. ముఖ్యంగా తెలుగు భాషలో నిర్వహించాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు కోరుకుంటున్నారు. బయాలజీ ఉపాధ్యాయులకు గణితం, భౌతిక శాస్త్రంలో పరీక్షలు నిర్వహించడం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను, వారి మానసిక వేదనను అర్థం చేసుకొని పేపర్ 3 నిర్వహించి భాషోపాధ్యాయులకు న్యాయం చేయాలి. ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు 60 మార్కులు, బిసిలకు 75 మార్కులు, ఒసిలకు 90 మార్కులు రావాలనడం సమంజసంగా లేదు. ఏ పరీక్షలలోనైనా 35 మార్కులకే ఉత్తీర్ణత ఉంటుంది. అలాంటిది టెట్‌లో 90 మార్కులు రావాలన్న నియమం ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తుంది. కులప్రాతిపదికన మార్కులు కేటాయించడం ఏ పరీక్షలలోనూ లేదు. ఒక పాఠశాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి నలుగురు ఉపాధ్యాయులు ఉంటే నలుగురిలో ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులకు 65% మార్కులు, బిసి ఉపాధ్యాయుడికి 77 మార్కులు, జనరల్ (ఒసి) ఉపాధ్యాయుడికి 89 మార్కులు అందరి కంటే ఎక్కువ వచ్చినప్పటికీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఉపాధ్యాయులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించి జనరల్ ఉపాధ్యాయుడు ఉత్తీర్ణత కాలేదు అనడం విశేషం. సమాజం దృష్టిలో, విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టిలో, వారి భార్యాబంధువుల దృష్టిలో టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించని ఉపాధ్యాయుడిగా చిన్నచూపు. టెట్ పరీక్ష అంటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష 25, 30 సంవత్సరాల నుండి పదవ తరగతి విద్యార్థులకు బోధించి, ఉత్తమ పౌరులను తయారు చేసి కొంత మంది విద్యార్థులే ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించేటట్లు సలహాలు, సహకారం అందించి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం చేత, స్వేచ్ఛంద సంస్థల చేత ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానింపబడి టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించనంత మాత్రాన ఉపాధ్యాయ వృత్తికి పనికి రాడనడం ఏ రకమైన నీతి, న్యాయం, ధర్మమో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఆర్‌టిఇ) ఆధ్వర్యంలో పుస్తక రచయితలుగా ఉన్నవారు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించలేదు కాబట్టి ఉపాధ్యాయుడిగా అర్హత లేదు అనడం సమంజసమేనా? భాషోపాధ్యాయులు (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడం, తమిళం ఇతర దేశీయ భాషలు)బయోలజీ బోధించే ఉపాధ్యాయులకు వారు బోధించే సబ్జెక్టులో టెట్ పరీక్షను నిర్వహించకుండా వారికి సంబంధం లేని ఆంగ్లం, సాంఘికశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రం, మానసిక శాస్త్రంలో పరీక్షలను నిర్వహించి ఉత్తీర్ణత సాధించాలని అనడం విచారించదగిన విషయంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెట్ పరీక్ష ఉపాధ్యాయ అర్హత పరీక్ష మాదిరిగా డాక్టర్ అర్హత పరీక్ష, న్యాయవాద అర్హత పరీక్ష, ఇంజినీర్ అర్హత పరీక్ష అంటూ ఏ వృత్తిలో లేని అర్హత పరీక్ష ఉపాధ్యాయులకు మాత్రమే నిర్వహించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెట్ ఉత్తీర్ణత సాధించకుంటే పదోన్నతి రాదనడం, ఉద్యోగం వదులుకోవలనడం ఇదేమి న్యాయమని అనేకమంది ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. విద్య ఉమ్మడి జాబితాలో ఉండడంవల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ రకమైన విధానం అమలు చేస్తుందో అని ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీచర్స్‌గా 2010 కంటే ముందు ఉన్న వాళ్ళకు టెట్‌నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుకుంటున్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్) ఆధ్వర్యంలో దేశరాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు శ్రీపాల్ రెడ్డి కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పదవీవిరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత హెల్త్ కార్డుల కోసం ఒక కమిటీని ఏర్పాటు చేయడం గొప్ప పరిణామంగా వారు భావిస్తున్నారు.

## ఏపీలో నియోజకవర్గాలకు ర్యాంకులు.. ఎమ్మెల్యేల పనితీరుకు మార్కులు..

ఏపీలో ప్రభుత్వ పాలనను పరుగులు పెట్టించేందుకు సీఎం చంద్రబాబు నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల పనితీరుపై సర్వే నిర్వహించి, వాటికి ర్యాంకులు, గ్రేడులు కేటాయించారు. ఎమ్మెల్యేల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సంతృప్తి వంటి అంశాల ఆధారంగా చేపట్టిన ఈ సర్వేలో 93 శాతం మార్కులతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈ నియోజకవర్గానికి బీజేపీ నేత సుజనా చౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ఈ ర్యాంకుల్లో 92 శాతం మార్కులతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్న గాజువాక నియోజకవర్గం రెండో స్థానాన్ని దక్కించుకుంది. కాకినాడ అసెంబ్లీ నియోజకవర్గం, విజయవాడ తూర్పు నియోజకవర్గాలు వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ప్రభుత్వ పథకాల అమలు, శాసనసభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండటం, ఫైళ్ల పరిష్కారం వంటి పలు కీలక అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ సర్వే నిర్వహించారు.

రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాలను ఏ+, ఏ, దీ గ్రేడులుగా విభజించారు. వీటిలో 21 నియోజకవర్గాలు ఏ+ గ్రేడులో, 153 నియోజకవర్గాలు ఏ గ్రేడులో ఉండగా, కేవలం ఒక్క నియోజకవర్గం మాత్రమే దీ గ్రేడులో నిలవడం గమనార్హం. పాలనలో సాంకేతికతకు పెద్దపీట వేస్తున్న చంద్రబాబు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇటీవలే ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి, వారి పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు సలహాలు ఇస్తూ, వారిని ప్రోత్సహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన పల్లా శ్రీనివాసరావు, తాజాగా ఆయన నియోజకవర్గం పనితీరులోనూ రెండో స్థానంలో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పనితీరును మరింత మెరుగుపరచుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా చంద్రబాబు ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు.

## అమెరికాతో ఉద్రిక్తతలు..

అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఇరాన్‌లో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ 37 ఏళ్లుగా పాటిస్తున్న ఒక కీలక సంప్రదాయాన్ని తొలిసారిగా పక్కనపెట్టారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 8న జరిగే వైమానిక దళ కమాండర్ల సమావేశానికి ఆయన గైర్హాజరయ్యారు. 1989లో నాయకత్వ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఖమేనీ ప్రతి సంవత్సరం ఈ సమావేశానికి హాజరవుతూ వస్తున్నారు. ఇరాన్ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో కూడా ఆయన ఈ సమావేశాన్ని నిర్వహించారు. 1979 ఫిబ్రవరి 8న ఇరాన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు పహ్లావి రాజవంశాన్ని కూలదోసి, ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడు అయతొల్లా రుహొల్లా ఖమేనీకి మద్దతు ప్రకటించారు. ఆ చారిత్రక ఘటనకు గుర్తుగా ఏటా ఈ తేదీన వైమానిక దళ ఉన్నతాధికారులు సుప్రీం లీడర్‌తో భేటీ అవుతారు. ఈ ఏడాది ఖొమేనీకి బదులుగా ఆర్మీ చీఫ్ అబ్దొల్‌రహీం మౌసవి కమాండర్లతో సమావేశమయ్యారు.

**అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తతలు**

ఖమేనీ గైర్హాజరు వెనుక అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తతలే కారణమని అంతర్జాతీయంగా విశ్లేషణలు వెలువడుతున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తన సైనిక ఉనికిని భారీగా విస్తరిస్తోంది. తమపై అమెరికా దాడి చేస్తే, ఈసారి యుద్ధం మధ్యప్రాచ్యం మొత్తం విస్తరిస్తుందని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. గతేడాది జూన్‌లో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య 12 రోజుల పాటు జరిగిన యుద్ధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తన యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌకను అరేబియా సముద్రానికి పంపింది. డజను ఎఫ్-15 ఫైటర్ జెట్లు, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, ఇతర యుద్ధ విమానాలు జోర్డాన్‌లోని వైమానిక స్థావరానికి చేరుకున్నాయని బీబీసీ తన కథనంలో పేర్కొంది. యూఎస్ఎస్ డెల్బర్ట్ డి బ్లాక్ యుద్ధనౌక సూయజ్ కాలువ ద్వారా ఎర్ర సముద్రంలోకి ప్రవేశించినట్టు శాటిలైట్ చిత్రాలను విశ్లేషించి వెల్లడించింది. గల్ఫ్ ప్రాంతంలో నిఘా కోసం పలు డ్రోన్లు, నిఘా విమానాలు కూడా తిరుగుతున్నట్టు సమాచారం. ఇరాన్ క్షిపణి వ్యవస్థపై చర్చ జరగాలని అమెరికా పట్టుబట్టడం, తాము కేవలం అణు కార్యక్రమంపైనే చర్చిస్తామని ఇరాన్ స్పష్టం చేయడంతో ఇరు దేశాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది.

## స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసానికి విపక్షాల ప్లాన్..

- మొదటి పేజి తరువాయి

తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు, ఇరుపక్షాల మధ్య అపనమ్మకం ముదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

గత గురువారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించాల్సి ఉండగా, విపక్షాల తీవ్ర నిరసనల మధ్య సభను స్పీకర్ అర్ధాంతరంగా వాయిదా వేశారు. 'ప్రధానిని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్ష ఎంపీలు ఏదో అనుకోనిది చేయొచ్చని సమాచారం అందింది' అని ఓం బిర్లా చెప్పడం వివాదానికి దారితీసింది. అంతకుముందు కొందరు మహిళా ఎంపీలు ప్లకార్డులతో ప్రధాని సీటు వద్దకు (ఆ సమయంలో ప్రధాని అక్కడ లేరు) వెళ్లారు. స్పీకర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ "పూర్తి అబద్ధాలు" అని కొట్టిపారేశారు. "ప్రధాని ఇప్పుడు స్పీకర్ చాటున దాక్కుంటున్నారు... ఆయనకు ధైర్యం లేదు" అని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఈ అవిశ్వాస తీర్మానంలో స్పీకర్‌కు వ్యతిరేకంగా మూడు ప్రధాన అంశాలను ప్రతిపక్షాలు హైలైట్ చేయనున్నాయి. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలోని కొన్ని భాగాలను చదివేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడం మొదటిది. అదే సమయంలో కాంగ్రెస్‌ను, గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న పుస్తకాల నుంచి చదివేందుకు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేకు అనుమతి ఇవ్వడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన దూబేపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నాయి. 2020లో భారత్-చైనా సరిహద్దు వివాదంపై ఉన్న ఆ పుస్తక భాగాలను రికార్డుల్లో చేర్చాలని రాహుల్ పట్టుబట్టారు. తాను ఆ సమాచారానికి బాధ్యత వహిస్తానని లిఖితపూర్వకంగా ఇచ్చినా స్పీకర్ అంగీకరించలేదు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. ఈ క్రమంలో నిరసన తెలిపిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలను సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. "రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. దీనిపై నిరసన తెలిపితే మమ్మల్ని సస్పెండ్ చేశారు. ఇది అంత పెద్ద నేరమా?" అని సస్పెండైన ఎంపీ అమరీందర్ రాజా వారింగ్ ప్రశ్నించారు. ఈ పరిణామాలతో పార్లమెంట్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది.

## తొలి ఎన్నికల బరిలో విజయ్.. రెండు నియోజకవర్గాల నుంచి పోటీ!

నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తన రాజకీయ అరంగేట్రానికి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. చెన్నైలోని విరుగంబాక్కం, మధ్య తమిళనాడులోని తిరుచ్చి తూర్పు స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇది పార్టీ విస్తరణతో పాటు వ్యవస్థాపకుడైన విజయ్‌కు బలమైన ఆరంభం ఇచ్చేందుకు రూపొందించిన వ్యూహమని టీవీకే నేతలు చెబుతున్నారు. చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం పట్టణ ఓటర్లు, మొదటిసారి ఓటు వేయనున్న యువతలో విజయ్‌కు మంచి ప్రచారం కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు తిరుచ్చి తూర్పు నుంచి పోటీ చేయడం ద్వారా పార్టీ కేవలం చెన్నైకే పరిమితం కాదనే సంకేతాన్ని రాష్ట్రవ్యాప్తంగా పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి వెలచ్చేరి, విక్రవాండి, నాగపట్టణం వంటి నియోజకవర్గాలను కూడా పరిశీలించినా, ఓటర్లతో ఉన్న పరిచయం, క్షేత్రస్థాయిలో పార్టీ సన్నద్ధత ఆధారంగా విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలను ఖరారు చేసినట్లు సమాచారం. విజయ్ తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తుండటం, అధికార డీఎంకే బలంగా ఉండటంతో గెలుపు అవకాశాలను పెంచుకునేందుకే రెండు చోట్ల పోటీ చేయాలనే జాగ్రత్తతో కూడిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలకు డీఎంకే ఎమ్మెల్యేలు ఏ.ఎం.వి. ప్రభాకర రాజా, ఇనిగో ఎస్. ఇరుదయరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ రెండు చోట్లా పోటీ ఆసక్తికరంగా మారనుంది. త్వరలోనే విజయ్ తన ప్రచార వ్యూహాలను ప్రకటించి, బహిరంగ సభలను ముమ్మరం చేయనున్నారు.

## 'పరీక్షా పే చర్చ'లో దేశ నిర్మాణంపై విద్యార్థులకు మోదీ పాఠాలు

10, 12వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే 'వికసిత భారత్' నిర్మాణం గురించి ఆలోచిస్తుండటం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్తు లక్ష్యాలపై యువత దృష్టి సారించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఇవాళ 'పరీక్షా పే చర్చ 2026' రెండో ఎపిసోడ్‌లో భాగంగా ఆయన దేశవ్యాప్తంగా విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడులోని కోయంబత్తూరుతో పాటు పలు ప్రాంతాల విద్యార్థులతో ప్రధాని సంభాషించారు. 2047 నాటికి దేశాభివృద్ధికి దోహదపడాలనే విద్యార్థుల ఆసక్తిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అభివృద్ధి చెందిన దేశాల పౌరులలో ఉండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. "ఇంట్లో భోజనం చేసేటప్పుడు ప్లేటులో ఒక్క మెతుకు కూడా వృథా చేయకుండా తినడం అలవాటు చేసుకోండి. ఇలా దేశంలోని ప్రతి ఒక్కరూ చేస్తే ఎంత ఆహారం ఆదా అవుతుందో ఊహించండి. ఇలాంటి చిన్న పనులే బలమైన, బాధ్యతాయుతమైన భారత నిర్మాణానికి పునాదులు వేస్తాయి" అని మోదీ విద్యార్థులకు వివరించారు.

అలాగే ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్ లైట్ పడినప్పుడు ఆగడం వంటి చిన్న విషయాలు కూడా వ్యక్తిగత క్రమశిక్షణకు నిదర్శనమని ప్రధాని తెలిపారు. స్ఫూర్తి, ప్రేరణ వంటివి విజయానికి కేవలం అదనపు హంగులు మాత్రమేనని, కానీ క్రమశిక్షణే దానికి అసలైన పునాది అని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదో విడతగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి 4.5 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు రావడం విశేషం. పరీక్షల ఒత్తిడిని తగ్గించడంతో పాటు దేశ ప్రగతిలో తమ పాత్ర గురించి విద్యార్థులను ఆలోచింపజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

## అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు..అయినా జైలుకే!

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఒక కేసులో ఊరట లభించినా, ఆయన జైలు నుంచి ఇప్పట్లో విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు ఇవాళ ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన జైలు నుంచి బయటకు వస్తారని అంతా భావించారు. అయితే, ఆయన బెయిల్‌పై విడుదలవుతున్న సమయంలోనే పట్టాభిపురం పోలీసులు మరో కేసులో రంగప్రవేశం చేశారు. గతంలో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై నమోదైన కేసులో పీటీ వారెంట్‌పై అంబటిని స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, ఆయనకు 14 రోజుల పాటు అంటే ఈ నెల 22 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. సీఎంపై వ్యాఖ్యల కేసులో ఈ నెల 1న అరెస్టయిన అంబటి, అప్పటి నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్న విషయం తెలిసిందే. తాజాగా ఒక కేసులో బెయిల్ వచ్చినా, మరో కేసులో రిమాండ్ పడటంతో పోలీసులు ఆయన్ను తిరిగి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. కాగా, అంబటి రాంబాబుపై రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 కేసులు నమోదైనట్లు సమాచారం.

## ఎంఐఎం మద్దతు లేకుండా కాంగ్రెస్ గెలిచిందా?

- మొదటి పేజి తరువాయి

అని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం సత్తా ఏమిటో చూపుతామని అన్నారు. మరోవైపు అసోం సీఎం హిమంత బిశ్వపై హైదరాబాద్ పోలీసులకు ఒవైసీ ఫిర్యాదు చేశారు. ముస్లింలను కాల్చుతున్నట్టుగా ఉన్న వీడియోను పోస్టు చేసినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని ఒవైసీ అన్నారు. ముస్లింలను రెచ్చగొట్టేందుకు దురుద్దేశపూర్వకంగా ఈ వీడియోను హిమంత పోస్టు చేశారని మండిపడ్డారు. జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించేలా ఆయన తీరు ఉందని విమర్శించారు.

## పంజాబ్ సీఎం విదేశీ పర్యటనకు అనుమతినివ్వని కేంద్రం

- మొదటి పేజి తరువాయి

పర్యటన అర్ధాంతరంగా రద్దయింది. ఇటీవల మాన్ విదేశీ పర్యటనలకు అనుమతి నిరాకరించడం ఇది వరుసగా మూడోసారి కావడం గమనార్హం. పంజాబ్ ప్రభుత్వం వచ్చే నెలలో నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్టర్స్ సమ్మిట్' కోసం పెట్టుబడులను ఆహ్వానించడానికి భగవంత్ మాన్ చెక్ రిపబ్లిక్ మరియు నెదర్లాండ్స్‌లో పర్యటించాల్సి ఉంది. పారిశ్రామికాభివృద్ధి, విద్య, మరియు విదేశీ పంజాబీల సహకారం కోసమే ఈ పర్యటన ఖరారైంది. అయితే కేంద్రం నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు బ్రేక్ పడింది.

**వివాదాస్పదంగా 'పొలిటికల్ క్లియరెన్స్'**

రాష్ట్రాల ముఖ్యమంత్రులు విదేశాల్లో పర్యటించేందుకు విదేశాంగ శాఖ అనుమతి తీసుకోవడం తప్పనిసరి. దీనినే పొలిటికల్ క్లియరెన్స్ గా వ్యవహరిస్తారు. అయితే, ఈ నిబంధన చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. పంజాబ్ విషయానికి వస్తే.. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పర్యటనలపై కేంద్రం వరుసగా ఆంక్షలు విధిస్తోంది. పొలిటికల్ క్లియరెన్స్ నిరాకరిస్తోంది. ఈ ఏడాది జనవరిలో యూకే మరియు ఇజ్రాయెల్ లో పర్యటించేందుకు మాన్ అనుమతి కోరగా నిరాకరించింది. గతంలో పారిస్ ఒలింపిక్స్ సందర్శనకూ ఇలాగే అడ్డుచెప్పడంతో ఆ పర్యటన రద్దయింది. తాజాగా చెక్ రిపబ్లిక్, నెదర్లాండ్స్ పర్యటనకూ మాన్ కు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. అయితే, ఈ అనుమతిని నిరాకరించడానికి గల కారణాలను విదేశాంగ శాఖ బహిరంగంగా వెల్లడించలేదు. ఈ వ్యవహారం ఇప్పుడు కేంద్ర-రాష్ట్ర సంబంధాల మధ్య మరోసారి చిచ్చు రేపింది.

**కేంద్రంపై 'ఆప్' విమర్శ**

కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తీవ్రంగా ఖండించింది. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల అభివృద్ధిని కేంద్రం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని ఆప్ నేతలు మండిపడుతున్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు విదేశాలకు వెళ్తున్నప్పుడు పంజాబ్ సీఎంకు మాత్రమే అనుమతి ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నిస్తున్నారు.

# బుచ్చి పట్టణం నూతన మున్సిపాలిటీ భవనం పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 9. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలోని కట్టుబడి పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్) భవనం యొక్క నిర్మాణ పనులను, నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ ఆఫీస్ భవన నిర్మాణ పనులను, పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ తో పాటు మున్సిపల్ కమిషనర్ డి బాలకృష్ణ, కౌన్సిలర్లు రాచూరి సత్యం, కత్తి నాగరాజు, టిడిపి నాయకుడు పటాన్ మహబూబ్ బాషా, ఏఈ వెంకటేష్, పాల్గొన్నారు....



పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# తిరుమల లడ్డు పై అసత్య ఆరోపణలు తగవు...

## - మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య...

నాయుడుపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 9
రాజకీయ అధికారాన్ని కాపాడుకునేందుకు దేవుడినీ, భక్తుల విశ్వాసాలనూ పావులుగా మార్చుకున్న చంద్రబాబు నాయుడు మరోసారి తన నీచ రాజకీయ స్వభావాన్ని బయటపెట్టుకున్నారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రసాదమైన లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందంటూ ఆధారాలు లేని అసత్య ఆరోపణలు చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను గాయపరిచిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం నాయుడుపేటలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో సంజీవయ్య మాట్లాడుతూ దేవుడి పవిత్రతను రాజకీయ లాభాలకు ఉపయోగించుకోవడం చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనలకు అద్దం పడుతోందన్నారు. తిరుమల లడ్డూ అనేది కేవలం ప్రసాదం మాత్రమే కాదని, కోట్లాది భక్తుల ఆత్మీయ విశ్వాసానికి ప్రతీక అని తెలిపారు. అటువంటి పవిత్ర ప్రసాదంపై తప్పుడు ప్రచారం చేయడం ద్వారా స్వామివారి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేయడం ఘోరమైన నేరమన్నారు. తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని దేశంలోనే అత్యంత విశ్వసనీయత కలిగిన ఎన్‌డీఆర్ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌లు స్పష్టంగా నిర్ధారించాయని ఆయన గుర్తు చేశారు. శాస్త్రీయ నివేదికలు వెలువడినా వాటిని పక్కన పెట్టి అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చంద్రబాబు ప్రయత్నించడం ఆయన రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. అధికారాన్ని కోల్పోయిన నాటి నుంచి ప్రజల దృష్టిలో పూర్తిగా నమ్మకం కోల్పోయిన చంద్రబాబు, తన రాజకీయ జీవితం నిలబెట్టుకోవడానికి దేవుడి పేరుతోనైనా కుట్రలు చేయడానికి వెనుకాడడం లేదని సంజీవయ్య విమర్శించారు. చంద్రబాబు వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రజలే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది వెంకటేశ్వర స్వామి భక్తులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారని తెలిపారు. ఇకనైనా చంద్రబాబు తన అబద్ధపు ప్రచారానికి బాధ్యత వహించి, తిరుమల లడ్డూపై చేసిన అసత్య ఆరోపణలకు భక్తుల సమక్షంలో, రాష్ట్ర ప్రజల ముందు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కిలివేటి సంజీవయ్య స్పష్టం చేశారు. లేదంటే ఈ విషయంలో ప్రజలు చంద్రబాబుకు తగిన గుణపాఠం



చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎండీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, వైసీపీ పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, నాయుడుపేట మండల వైసీపీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, ఓజిలి మండల వైసీపీ అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి, నియోజకవర్గ వైసీపీ మహిళా విభాగం అధ్యక్షులు ఈదా రత్న శ్రీ, మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ షబ్బీర్, కావేరి పాకం అశోక్ కుమార్, వైసీపీ నాయకులు గంధవల్లి సిద్ధయ్య, మెస్ భాస్కర్ రెడ్డి, తన్నమాల రమణయ్య తదితరులు పాల్గొన్నారు

# మైలేరు పండుగలో ఎద్దు పొడిచి వ్యక్తిమృతి

## - మరొకరికి తీవ్ర గాయాలు.

పలమనేరు, పెన్ పవర్, ఫిబ్రవరి 09, నియోజకవర్గ వ్యాప్తంగా పలుచోట్ల మైలేరు ట్రెండ్ నడుస్తోంది. పలమనేరు మండలం, కొలమాసనపల్లి గ్రామంలో కొన్ని రోజుల క్రితం మైలేరు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి ఎద్దులు ఈ క్రీడల పోటీల్లో పాల్గొన్నాయి. నిర్వాహకులు వాటికి ర్యాంకింగ్ ఇస్తూ కామెంట్రీ చేస్తూ విచ్చేసిన ప్రజలను ఉత్తేజ పరుస్తూ ఉన్న సందర్భంలో ఒక్కసారిగా ఎద్దు జనాల్లోకి దూసుకొచ్చింది అందులో ఇద్దరు ఎద్దు కాళ్ళ కింద నలిగే పోయారు. అక్కడున్న స్థానికులు ప్రథమ చికిత్స చేసి వైద్యం కొరకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే వ్యక్తి మృతి చెందాడని వైద్యులు తెలిపారు, మరో వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఒక వ్యక్తి ప్రాణం పోవడానికి ఎవరు కారణం, మైలేరు నిర్వహించి నిర్వాహకులా? అనుమతులిచ్చిన వారా? జిల్లా స్థాయిలో ఎస్పీ, కింది స్థాయి అధికారులకు స్పష్టంగా ఆదేశాలిచ్చి ఉన్నారు ప్రజలకు ప్రాణాపాయం కలిగించే ఏ ఆటలైన కూడా అనుమతులు ఉండవని, కానీ కొంతమంది వీటిని పెడచెవిన పెడుతున్నారని, కొలమాసనపల్లి ఘటన స్పష్టమవుతోంది. ఈ ఘటనకు కొంతమంది అధికారులు స్థానిక నేతలు కారణం అనుకోవచ్చా? అని ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఏది ఏమైనా సంప్రదాయం అవసరమే అలా అని ప్రజలు ప్రాణాల పోతుంటే చూస్తూ ఊరుకుంటే అది ఎంతవరకు సమంజసం.

**జల్లికట్టు..మైలేరు వలన సమస్యలు ఏమంటే ?**

ఎద్దులు పొడవటం వల్ల మనిషి కడుపు, ఛాతి భాగాల్లో తీవ్రమైన గాయాలవుతాయి. ప్రతి ఏటా ఈ పందాల్లో కొందరు ప్రాణాలు కోల్పోవడం చూస్తూనే ఉన్నాం. గాయపడిన వారు పేద లేదా మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారైతే, వారి చికిత్స కోసం భారీగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఒకవేళ ఇంటి యజమాని చనిపోతే ఆ కుటుంబం వీధిన పడే ప్రమాదం ఉంది. పందాల సమయంలో గొడవలు జరగడం, సమూహాల మధ్య ఘర్షణలు తలెత్తడం వంటివి జరుగుతుంటాయి. నియంత్రణ తప్పిన ఎద్దులు ఒక్కోసారి గ్యాలరీల్లోకి దూసుకెళ్లి ప్రేక్షకులను కూడా గాయపరుస్తాయి. పశువుల పట్ల క్రూరత్వం జరుగుతుందనేది ప్రధాన విమర్శలు ఎద్దులను



రెచ్చగొట్టడానికి వాటి తోకలను మలపడం, పదునైన వస్తువులతో పొడవటం వంటివి చేస్తుంటారు. రంగులు పూయడం, భారీ శబ్దాలు, జనం కేకల మధ్య ఎద్దులు తీవ్రమైన భయాందోళనకు గురవుతాయి. అలాగే కొన్ని సందర్భాల్లో ఎద్దులు వేగంగా పరుగెత్తడానికి వాటికి కల్తీమద్యం లేదా ఇతర మత్తు పదార్థాలు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాంప్రదాయాన్ని గౌరవిస్తూనే, ఎద్దులకు మరియు మనుషులకు హాని కలగకుండా కఠినమైన నిబంధనలతో వీటిని నిర్వహించడం నేటి కాలంలో అత్యవసరమని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు

# భూమిని దున్నుకుంటున్న అలివేలమ్మ కుటుంభంపై దాడి

## - చంపేస్తామన్న బెదిరింపులతో వణికి పోతున్న బాధితులు !

పలమనేరు, పెన్ పవర్, ఫిబ్రవరి 09,
కుటుంబ పోషణార్థం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న అలివేలమ్మ తన అన్నతో కలిసి భూమిని దున్నుతుంటే తనపై కక్షతో తనతో పాటు మరో ముగ్గురిని చంపేస్తామని బెదిరించడమే కాకుండా దాడిచేశారని ఆమె వాపోయారు. ఈసందర్భంగా బాధితురాలు అలివేలమ్మ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని పెద్దపంజాని మండలం, వీరప్పల్లి పంచాయతీ సుద్దగుండ్లపల్లె గ్రామంలో చింతలకుంట చెరువు పోరంబోకు భూమిలో వరిపైరు నాటడానికి దున్నుతుంటే అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం, మల్లికార్జున అలియాస్ మల్లప్ప, కుమార లు కలిసి భూమి దున్నవద్దని అడ్డుపడ్డారు. ఇదేమి అన్యాయమని అడిగితే దౌర్జన్యంగా కట్టెలతో దాడి చేశారు. దీంతో ప్రాణభయంతో వణికి పోయామన్నారు. అంతేకాకుండా గతంలో మా అన్న భూమిని ఇదేవిధంగా ఆక్రమించాలని ప్రయత్నం చేశారని, ఇప్పుడు అలాగే దాడులకు తెగబడ్డారని, మరో సారి ఇక్కడ దున్నితే అందరినీ చంపి ఈభూమిలోనే పాతి పెడతామని భయభ్రాంతులకు గురిచేశారని ఆమె ఆవేదన చెందారు. ఈ ఏడాదిలో తనతో పాటు అన్న రెడ్డప్ప, సమీప బంధువు వెంకట లక్ష్మమ్మ ఆమె కుమారుడు సుబ్రహ్మణ్యం పైన కూడా దాడి చేశారని ఆమె అన్నారు. ఇదే విషయంపై పెద్దపంజాని పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని, మాకు సుబ్రహ్మణ్యం,



మల్లికార్జున, కుమార లేచే ప్రాణహాని ఉందని, కావున అధికారులే మమ్మల్ని కాపాడాలని భాదితులు కోరుతున్నారు

# మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు 87 ఫిర్యాదులు

తిరుపతి/పెన్ పవర్/ఫిబ్రవరి 09
తిరుపతి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో “మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని అదనపు ఎస్పీలు రవి మనోహర చారి (శాంతిభద్రతలు), శ్రీనివాసులు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులను అదనపు ఎస్పీలు స్వయంగా పరిశీలించి, సంబంధిత పోలీస్ అధికారులకు తక్షణ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేస్తూ, ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 87 ప్రజా ఫిర్యాదులు స్వీకరించగా, వాటి పరిష్కార నిమిత్తం సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో సీఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు



# కొడవలూరులో కామన్ సర్వీస్ సెంటర్ ( సి ఎస్ సి) ప్రారంభించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కొడవలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 9.
కొడవలూరు మండల కేంద్రంలో ఆన్‌లైన్ సేవల కేంద్రాన్ని ప్రారంభించడం శుభపరిణామన్నారు కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి . ఎస్ వి కామన్ సర్వీస్ సెంటర్ (సి ఎ స్ సి) ప్రారంభోత్సవ అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఆన్లైన్ సేవా కేంద్రము ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తుందన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ (సి ఎ స్ సి) ద్వారా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ అప్‌డేట్స్, పాన్ కార్డ్, పెన్షన్ సేవలు మరియు ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించి సేవలు పొందవచ్చు అన్నారు. సామాన్య ప్రజలు చిన్న చిన్న పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే చోట అన్ని డిజిటల్ సేవలు పొందేలా కొడవలూరు మండల కేంద్రంలో కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటుచేసిన నిర్వాహకులను ఆమె అభినందించారు. కోడలూరు పరిసర ప్రాంత ప్రజలు ఆన్లైన్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల టిడిపి అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్ల నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ మందపాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి, కోడలూరు టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు జిలాని భాష తదితరులు పాల్గొన్నారు



# 29వ వివాహ వార్షికోత్సవం

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 9.
ఎప్పుడూ ఎదుటివారికి సహాయం చేయాలనే మంచి మనసుతో, చాలామందికి అండగా నిలిచిన శేషయ్య సార్ నిజంగా గౌరవానికి పాత్రులు. మీ ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ, పరస్పర అవగాహన, గౌరవం ఇవన్నీ ఆదర్శప్రాయమైన దాంపత్యానికి నిదర్శనం. ఈ రోజు మీ 29వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా, మీ దాంపత్య జీవితం ఇలాగే ఆనందంగా, ఆరోగ్యంగా, సుఖశాంతులతో కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. మీ జీవితంలో ఇంకా ఎన్నో మధురమైన క్షణాలు, చిరునవ్వులు నిండాలని దేవుడు ఆశీర్వదించాలి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు శేషయ్య సార్





# వైఎస్ఆర్సిపి నాయకుడు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే... వైసిపి రాష్ట్ర కార్యదర్శి...

పెళ్లకూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 9
మండలంలోని ముమ్మారెడ్డి గుంట గ్రామ పంచాయతీ చెందిన వైసీపీ నాయకులు మట్టిపాటి చెంగయ్య గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఈ మేరకు సోమవారం సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి కిలివేటి సంజీవయ్య, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి ముమ్మారెడ్డి గుంట గ్రామానికి చేరుకొని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. వై. యస్సార్ కాంగ్రెస్ పార్టీ లో ఉన్న ఒక దళిత నాయకుడిని కోల్పోవడం చాల బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ ఎల్లప్పుడు కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం శోక సంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల ఉపాధ్యక్షులు చుట్టు గురవయ్య, వైసీపీ నాయకులు కన్నలి బాలాజీ, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బకింగ్ హోమ్ కెనాల్ పై ఆక్రమణలు తొలగించండి

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 9.
కేంద్రం చేపట్టే జలరవాణాకు సహకరించండి..బిజెపి నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్..కేంద్ర ప్రభుత్వం జాతీయ జల రవాణాను ప్రారంభించాలని ఆదేశించింది. నెల్లూరు జిల్లాలో బకింగ్ హోమ్ కెనాల్ లిఆక్రమాలు తొలగించలని బి కెనాల్ డీఈ విజయ్ కుమార్ రెడ్డికి బిజెపి నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు 1973 సంవత్సరం వరకు నెల్లూరు జిల్లాలో జల రవాణా బకింగ్ హోమ్ కెనాల్ ద్వారా జరిగింది. 1990 తర్వాత ఆక్వా కల్చర్ రంగప్రవేశంతో సముద్రం ముఖద్వారాలను వాగులు నది ముఖద్వారాలను ఆక్రమణ చేశారు. కెనాల్ పై ఉన్న తొమ్మిది లాకులు శిథిలావస్థకు చేరాయి.. చిప్పలేరు ఉప్పుటేరు కండలేరు వాగుల ముఖద్వారాలు పూడ్చేశారు. 60 అడుగుల కాలువ ఆరడుగుల పరిధిలోకి తగ్గింది. ముత్తుకూరు- చిలుకూరు మండలంలో కండలేరు క్రీక్ ను కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం పుడ్చేసింది. ఒక కిలోమీటర్ ఇంతనానికి 25 టన్నుల సరుకు రోడ్ మార్గంలో రవాణా అవుతుంది. ఒక లీటర్ ఇంధనానికి 105 టన్నుల సరుకు జల రవాణాలో జరుగుతుంది. కెనాల్పై ఆక్రమణల తొలగిస్తే భూసేకరణ అవసరం లేకుండా జల ర ఆక్రమణలు తొలగించిజల రవాణాను పునరుద్ధరించాలని బిజెపి డిమాండ్ చేస్తున్నదని తెలిపారు..ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు కందికట్ల రాజేశ్వరి పద్మావతి. నరాల సుబ్బారెడ్డి. కంచర్ల నారాయణ యాదవ్. రాధారెడ్డి. నారాయణ. ప్రభాకర్ యాదవ్. కేశవ టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు



# రౌడీయిజానికి రోజులు లేవు

**ఎన్డీయే ప్రభుత్వమే ప్రజల అండ - వజ్రం కిషోర్.**

శ్రీకాళహస్తి , పెన్ పవర్, ఫిబ్రవరి,09:
ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు వైసీపీ కుల రాజకీయాలతో కుట్రలు పన్నుతోందని టీడీపీ శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్ మండిపడ్డారు. ఈ విష రాజకీయాలకు ప్రతి అడుగులో అడ్డుకట్ట వేస్తూ తెలుగుదేశం పార్టీ శ్రేణులు వజ్ర సంకల్పంతో పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.
జగన్ రెడ్డి వంటి నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం కులం, మతం, ప్రాంతాల పేరుతో ప్రజలను విభజించి అధికార లాభాలు పొందాలని చూస్తున్నారని విమర్శించారు. వైసీపీ అరాచక పాలనను ప్రజలకు ఎండగడుతూ, దానిని మూలాల నుంచి పెకలించేందుకు ప్రతి టీడీపీ కార్యకర్త సైనికుడిలా క్రమశిక్షణతో పనిచేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సూచించారని తెలిపారు. వైసీపీ నేతలు చేస్తున్న తప్పులను కులాలకు అంటగట్టే ప్రయత్నాలు ప్రజలు సహించరని అన్నారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు కాపులకు అండగా నిలిచింది తెలుగుదేశం పార్టీయేనని, కాపుల అభ్యున్నతి టీడీపీ అజెండా అని స్పష్టం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా కాపులను టీడీపీ నుంచి దూరం చేయలేరని హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలపడం మహాపాపమని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అంబటి, జోగి వంటి నేతలతో వీధి నాటకాలు వేయించడం ద్వారా నిజం దాచలేరని స్పష్టం చేశారు.
రౌడీయిజం, బూతు రాజకీయాలకు రోజులు



చెల్లిపోయాయని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రజల పక్షాన నిలిచి అరాచక శక్తులకు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.

# హంస వాహనంపై సరస్వతీ అలంకారంలో కల్యాణ శ్రీనివాసుడు




తిరుపతి/పెన్ పవర్/ ఫిబ్రవరి 09
శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన సోమవారం రాత్రి అనంత తేజోమూర్తి అయిన శ్రీనివాసుడు సరస్వతి దేవి అలంకారంలో హంస వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 గంటల నుండి స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వాహనం ముందు వృషభాలు, అశ్వాలు, గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.


**హంస వాహనం బ్రహ్మ పద ప్రాప్తి**

హంస వాహనసేవలో శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామివారు జ్ఞానమూర్తిగా ప్రకాశిస్తాడు. ఐతిహ్యానుసారం బ్రహ్మ వాహనమైన హంస జ్ఞానానికి ప్రతీక. పాలను, నీళ్లను వేరుచేసే విచక్షణ దీని స్వభావం. ఇది ఆత్మానాత్మ వివేకానికి సూచకం. అందుకే ఉపనిషత్తులు పరమాత్మతో సంయోగం చెందిన మహనీయులను పరమహంసగా అభివర్ణిస్తున్నాయి.



శ్రీవారు భక్తులలో అహంభావాన్ని తొలగించి జ్ఞానసిద్ధి, బ్రహ్మపద ప్రాప్తి కలిగించేందుకే హంస వాహనాన్ని అధిరోహిస్తాడని పురాణాలు ఘోషిస్తున్నాయి.


వాహనసేవలో టీటీడీ జేఈవో శ్రీ వి.వీరబ్రహ్మం, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మి, ఏఈవో శ్రీ గోపినాథ్, సూపరింటెండెంట్ శ్రీ రాజ్‌కుమార్, కంకణబట్టార్ శ్రీ బాలాజి రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీ మునికుమార్, శ్రీ ధన శేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# చదువు వ్యాపారమైపోతుందా

**-ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోత తల్లిదండ్రులపై పెరుగుతున్న భారం**

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 9.
బుచ్చి టౌన్:పిల్లల భవిష్యత్తు నిర్మాణమే లక్ష్యమంటూ పనిచేయాల్సిన విద్యా వ్యవస్థ నేడు లాభాల మోజులో పడిపోయిందా? అనే ప్రశ్న తల్లిదండ్రుల మనసుల్లో బలంగా వినిపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం తగ్గిన పరిస్థితుల్లో, ప్రైవేట్ స్కూళ్లే ఆశగా మారాయి. అదే ఆశను ఆసరాగా చేసుకుని కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై భారాన్ని మోపుతున్నాయన్న ఆరోపణలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ప్రతి విద్యాసంవత్సరం ప్రారంభమవుతుందంటే చాలు, ఫీజుల పట్టికలు మారిపోతున్నాయి. ట్యూషన్ ఫీజుతో పాటు యాక్టివిటీ ఫీజు, డెవలప్‌మెంట్ ఛార్జీలు, డిజిటల్ క్లాస్ ఫీజులు అంటూ కొత్త కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఫలితంగా మధ్యతరగతి కుటుంబాలకు పిల్లల చదువు ఒక ఆర్థిక పరీక్షగా మారుతోంది. ఫీజుల భారం సరిపోదన్నట్లుగా, పుస్తకాలు, యూనిఫాంలను కూడా స్కూల్‌లోనే లేదా స్కూల్ సూచించిన దుకాణాల్లోనే కొనాలని పెట్టే ఆంక్షలు మరో సమస్యగా మారాయి. బయట మార్కెట్‌లో తక్కువ ధరలకు లభించే పుస్తకాలు, యూనిఫాంలు స్కూల్‌లో మాత్రం అధిక ధరలకు విక్రయమవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. బయట కొనుగోలు చేస్తే పిల్లలను ఇబ్బంది పెట్టడం, తరగతుల్లో ప్రశ్నించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. సీబీఎస్ తో పాటు రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ఏ ప్రైవేట్ స్కూల్ కూడా తల్లిదండ్రులను పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాంలను నిర్దిష్ట చోటే కొనాలని ఒత్తిడి చేయరాదు. ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే అధికంగా ఫీజులు వసూలు చేయడం, డొనేషన్ లేదా క్యాపిటేషన్ ఫీజుల పేరుతో డబ్బులు తీసుకోవడం చట్టవిరుద్ధమే. అయినా, ఈ నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పిల్లల చదువు మధ్యలో ఆగిపోతుందేమోనన్న భయం తల్లిదండ్రులను మౌనంగా ఉండేలా చేస్తోంది. "ఎవరైనా ఎదురు తిరిగితే పిల్లలపై ప్రభావం చూపుతారేమో" అన్న ఆందోళన వారిని ఫిర్యాదుల దారి నుంచి వెనక్కి నెడుతోంది. ఈ మౌనమే కొన్ని స్కూల్



యాజమాన్యాలకు బలం అవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్య ఒక సేవగా పరిగణించబడుతున్న నేపథ్యంలో, అనుచిత వ్యాపార ధోరణులు అవలంబిస్తే వినియోగదారుల చట్టం వర్తిస్తుందని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు, ఫీజు నియంత్రణ కమిటీలు, వినియోగదారుల కోర్టులు వంటి మార్గాలు తల్లిదండ్రులకు అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారు. చదువు వ్యాపారంగా మారకూడదన్న ఉద్దేశంతో రూపొందించిన నిబంధనలు అమల్లోకి రావాలంటే ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల వ్యవహారంపై సమగ్ర పర్యవేక్షణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటేనే తల్లిదండ్రుల భారం కొంతైనా తగ్గుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చివరికి ఒక ప్రశ్న మాత్రం మిగులుతోందిచదువు పిల్లల హక్కా? లేక కొందరి లాభాల సాధనమా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పాలకులపైనే ఉంది.

# జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు భోజనాల పంపిణీ

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,09:
గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జనవిజ్ఞాన వేదిక (జే.వి.వి.) ఆధ్వర్యంలో, టమోటో మర్చంట్ సెల్వం దాతృత్వంతో గర్భిణీ స్త్రీలకు భోజనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షరీనా మాట్లాడుతూ, గత 13 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక వారు మా ఆసుపత్రికి వచ్చే నిరుపేద గర్భిణీ స్త్రీలకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. జే.వి.వి. సేవలు స్ఫూర్తిదాయకమని ప్రశంసిస్తూ, ఆసుపత్రి సిబ్బంది తరపున జే.వి.వి. సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ సేవలకు సహకరిస్తున్న దాత సెల్వం ను ప్రత్యేకంగా అభినందించారు. జే.వి.వి. నాయకులు మాట్లాడుతూ, మంచి సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని, అందరూ వారి ఆశయాలను పునికి పుచ్చుకుంటే




మూఢనమ్మకాలను నిర్మూలించవచ్చని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్‌తో పాటు నాగరాజు, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, రామమోహన్, ప్రభాకర్, సుమన్ రెడ్డి, సుబ్బారావు, రజనీకాంత్, ఆనంద్, శ్రీనివాసాచారి, వెంకట్, సాయి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్ టి ఐ చట్టం అమలుపై పుత్తూరులో ఎఫ్ ఆర్ టి ఐ నేతల సమావేశం.

తిరుపతి , పెన్ పవర్, ఫిబ్రవరి, 09 :
ఎఫ్ ఆర్ టి ఐ జాతీయ గౌరవ అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్, జాతీయ అధ్యక్షులు మట్టా ప్రసాద్ సూచనల మేరకు జాతీయ సంయుక్త కార్యదర్శి కుప్పాల అజయ్ ప్రసన్న కుమార్ నేతృత్వంలో ఎఫ్ ఆర్ టి ఐ ప్రతినిధులు పుత్తూరు మున్సిపాలిటీ కమిషనర్ డి.వి. నాగేశ్వరరావు, పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ జె. చంద్రశేఖర్‌లను కలిసి ఫోరం ఫర్ ఆర్ టి ఐ నూతన క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ప్రకారం నిర్దేశిత గడువులోనే అందించాలని కోరగా, సంబంధిత శాఖల అధికారులు ఆర్ టి ఐ సెక్షన్ల మేరకు సమాచారాన్ని వేగంగా అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే హ్యూమన్ రైట్స్, సమాచార హక్కు చట్టం, లోకాయుక్త పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేస్తామని ఎఫ్ ఆర్ టి ఐ నేతలు తెలిపారు. అవినీతికి తావులేకుండా నిజాయితీగా సేవలు అందించాలన్న అభ్యర్థనకు అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, అప్పీలేట్ అధికారుల వివరాలను కార్యాలయాల వెలుపల ప్రదర్శనలో ఉంచుతామని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డీసీఎస్ రాయల్, తిరుపతి జిల్లా జనరల్ సెక్రటరీ బి. వెంకట్, జిల్లా మహిళా ఇంచార్జి వి. జయలక్ష్మీ, జిల్లా ఇంచార్జి అధ్యక్షులు జి. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# వీధిలైట్లు వెలగక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్న గ్రామస్తులు

**- అధికారులకు తెలుపుతున్నా పట్టించుకోని వైనం**

పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 09,
పలమనేరు మండలం మొరం పంచాయతీ రాజీవ్ నగర్ కాలనీలో గత 15 రోజులుగా వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై సంబంధిత పంచాయతీ కార్యదర్శి (సెక్రటరీ)కి ఫిర్యాదు చేసినా,ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో వీధులన్నీ



అంధకారంగా ఉండటంతో దొంగతనాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాలనీ శివారు ప్రాంతం కావడంతో చీకటిలో పాములు,ఇతర విషకీటకాలు ఎప్పుడు ఎటువైపు నుంచి వస్తాయో తెలియక ప్రాణభయంతో గడుపుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పక్షం రోజులు గడుస్తున్నా, కనీసం మరమ్మతులు చేసేందుకు కూడా ఎవరూ రాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల క్రితమే సెక్రటరీకి మొరపెట్టుకున్నాం. కానీ పరిస్థితిలో మార్పు లేదు. పిల్లలు,వృద్ధులు రాత్రిపూట బయటకు రావాలంటే వణికిపోతున్నారు. ఇక ఇప్పుడు కూడా సమస్య తీరకపోతే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# నిత్యవసరాలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

**నడవలేని వృద్ధురాలికి డాక్టర్ ప్రణీత్ చేయూత**

ఆత్మకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 9.
బాధలో ఉన్న వృద్ధురాలికి భరోసా ఇచ్చిన డాక్టర్ ప్రణీత్ ఆత్మకూరు పట్టణానికి చెందిన వృద్ధురాలు పఠాన్ బషీర్ ఉనిస గత కొన్ని సంవత్సరాలుగా రెండు కాళ్లు పూర్తిగా పనిచేయక నడవలేని దయనీయ పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారు. కూర్చోవడమే ఆమెకు నడకగా మారి, ప్రతి రోజూ జీవితం ఒక



పోరాటంగా మారింది. ఈ పరిస్థితిని గమనించిన డాక్టర్ ప్రణీత్ మానవత్వంతో స్పందించి, డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆ వృద్ధురాలికి మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేశారు. వైద్యుడిగా మాత్రమే కాకుండా సమాజ సేవకుడిగా డాక్టర్ ప్రణీత్ అందిస్తున్న సహాయం పలువురికి ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు ప్రశంసించారు.
ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తోడేటి అశోక్, రహీమ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ గ్రీవెన్స్ సెల్‌లో గిరిజనుల సమస్యలపై వినతి

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,09:
సోమవారం ప్రభుత్వ గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో భాగంగా గూడూరు మండల డిప్యూటీ తాసిల్దార్‌ను జిల్లా విజిలెన్స్ & మానిటరింగ్ ఎస్సీఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు ఏసుపాకు పెంచలయ్య కలిశారు. ఈ సందర్భంగా గిరిజన యానాది కుటుంబాలకు ఆధార్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఇటీవల గౌరవ ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజాదర్బార్‌లో స్వీకరించిన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గురవయ్య, ఎంఆర్పిఎస్ నాయకులు శంకరయ్య, టీడీపీ సీనియర్ నాయకులు చింతకుంట కృష్ణయ్యతో పాటు గిరిజనులు, అర్జీదారులు పాల్గొన్నారు.



# ఆత్మకూరు నుంచి తిరుమల వరకు సనాతన ధర్మ పరిరక్షణ మహా పాదయాత్ర

ఆత్మకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 9.
జనసేన ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభం భక్తి నినాదాలతో మారుమోగిన ఆత్మకూరు ధర్మ పరిరక్షణ కోసం పోరాటం ఆగదు: చదలవాడ హరీష్ కుమార్ పాదయాత్రలో పాల్గొన్న జనసైనికులు, వీర మహిళలు జిల్లా నేతలు సనాతన ధర్మ పరిరక్షణ సంకల్పంతో అడుగడుగునా జయధ్వానాలు నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సనాతన ధర్మ పరిరక్షణ మహా పాదయాత్ర సోమవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ ధర్మయాత్రకు శ్రీకారం చుట్టారు. ఆలయం నుంచి పాదయాత్రగా బయలుదేరిన జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ముందుగా ఆత్మకూరు శివాలయాన్ని దర్శించుకుని అక్కడి నుంచి ధర్మయాత్రను కొనసాగించారు. భక్తి గీతాలు, జై శ్రీరామ్ నినాదాలు, ధర్మ పరిరక్షణ నినాదాలతో ఆత్మకూరు పట్టణం మారుమోగింది. ఈ మహా పాదయాత్ర చేజర్ల రాపూరు వెంకటగిరి ఏర్పేడు శ్రీకాళహస్తి మీదుగా చివరకు తిరుపతి చేరుకోనుంది. తిరుమల క్షేత్ర గౌరవం, పవిత్రత పరిరక్షణే లక్ష్యంగా ఈ యాత్రను చేపట్టినట్లు జనసేన నాయకుడు చదలవాడ హరీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సనాతన ధర్మంపై జరుగుతున్న దాడులను తట్టుకోవడానికి, ధర్మ పరిరక్షణ కోసం ప్రజలను చైతన్యం చేయడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశ్యం. తిరుమల క్షేత్ర గౌరవాన్ని కాపాడే వరకు మా పోరాటం ఆగదు అని స్పష్టం చేశారు. పాదయాత్రలో జనసేన జిల్లా నాయకులు, మండల నేతలు, పెద్ద సంఖ్యలో జనసైనికులు, వీర మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు,



భక్తి శ్రద్ధలతో యాత్రలో అడుగులు వేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ధర్మయాత్రతో సనాతన ధర్మ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉద్యమానికి మద్దతు లభిస్తుందని జనసేన నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ధర్మ పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేశారు

# ఫిబ్రవరి 22న గుంటూరులో బీసీ సింహా గర్జన

ఆత్మకూరు, ఫిబ్రవరి 9:
బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు బీసీ రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల ఫిబ్రవరి 22వ తేదీన గుంటూరువిజయవాడ మధ్యలోని నాగార్జున యూనివర్సిటీ ఎదుట బీసీ సింహ గర్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీసీవై పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణను ఆత్మకూరు లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పాదాల చెంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో బీసీలపై అగ్రవర్ణాల దాడులు తీవ్రంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో బీసీలకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టం తీసుకురావడం అత్యవసరమని పేర్కొన్నారు. బీసీవై పార్టీ అధ్యక్షులు గోడే రామచంద్ర యాదవ్ అధ్యక్షతన జరగనున్న బీసీ సింహ గర్జనలో మొదటి అజెండాగా బీసీ రక్షణ చట్టం అమలు, అలాగే విద్య, ఉపాధి, రాజకీయాల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ను ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.
అదేవిధంగా, అమరావతి రాజధానిలో బీసీలకు 1000 ఎకరాల భూమిని కేటాయించాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం జరిగే విధమైన 99 పైసలకే భూమి ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని బీసీ సింహ గర్జనను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



వేల్పుల రామ్మోహన్, నక్క దినేష్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు,
లీలా కృష్ణ యాదవ్ యూత్ కో కన్వీనర్,
తిప్పిరిపోయిన రమేష్ స్టేట్ యూత్ కో కన్వీనర్, నాగేంద్ర నెల్లూరు జిల్లా యూత్ కో కన్వీనర్, గాలం ఓబులేష్ యాదవ్ యువ కార్యకర్త మరియు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# బీసీల రాజ్యాధికారానికి సింహగర్జన విజయవాడకు పిలుపు : హిమబిందు.

శ్రీకాళహస్తి,, పెన్ పవర్, ఫిబ్రవరి,09 :
విజయవాడ వేదికగా నిర్వహించనున్న బీసీల 'సింహగర్జన చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీవై పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కో-కన్వీనర్ హిమబిందు పిలుపునిచ్చారు.




స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సోమవారం బీసీవై పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మీడియా సమావేశం నిర్వహించి సింహగర్జన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన హిమబిందు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం సిద్ధించి 79 ఏళ్లు గడుస్తున్నప్పటికీ బీసీలు ఇప్పటికీ రాజ్యాధికారానికి దూరంగానే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అణగారిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీల పరిస్థితి కూడా అంతే దయనీయంగా ఉందన్నారు.
బడుగు వర్గాల్లో ఐక్యత లేకపోవడమే అగ్రవర్ణాలు నానాటికీ అణచివేతకు పాల్పడేందుకు కారణమవుతోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బడుగు వర్గాలు మేల్కొని రాజ్యాధికార సాధన దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. 'సింహగర్జన చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వంకా రమణయ్య, రామచంద్రయ్య, ఈశ్వర్, సునీల్, సురేష్, రఘు, గురవయ్య, బాలకృష్ణ, రామయ్య, మురగయ్య, చెంచయ్య, బత్తెయ్య తదితరులు పాల్గొన్నారు

# శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రిలో యువకుడి అనుమానాస్పద మృతి తల్లిదండ్రుల ఆవేదన.





శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి,09 : శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకున్న యువకుడి మృతి ఘటన స్థానికంగా కలకలం రేపింది. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం కానూరు గ్రామానికి చెందిన బత్తల చందు (23) ప్రేమ వ్యవహారానికి సంబంధించిన కారణాలతో మృతి చెందినట్లు తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమై ఆవేదన వ్యక్తం చేశారు. అకస్మాత్తుగా కుమారుడిని కోల్పోయిన బాధతో వారు ఆసుపత్రి ఆవరణలో విలపించగా, విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందించగా, వారు తక్షణమే కేసు నమోదు చేసి, మృతి కారణాలపై అన్ని కోణాల్లో విచారణ చేపట్టి నిజానిజాలు వెలుగులోకి తెస్తామని తెలిపారు

# మూలాపేటలోని ప్రాచీన మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి
భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించాం. ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం, వేదఆశీర్వచనాలతో కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య సాగింది. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ పుట్టా అజయ్ కుమార్ రెడ్డి పాలకమండలి సభ్యులందరికీ



హృదయపూర్వక అభినందనలు. మూలస్థానేశ్వర స్వామి ఆలయం శైవక్షేత్రాల్లో ప్రత్యేక ప్రతిష్ఠ కలిగిన దేవాలయం. నూతన పాలకమండలి సమిష్టిగా పని చేసి, పదవిని బాధ్యతగా భావిస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాను. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి. సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన నిర్ణయం. ఆలయాల ప్రతిష్ట మరింత ఇనుమడించేలా, ఆగమ పండితుల సూచనలతో ముందుకు సాగలి అని మంత్రి పొంగూరు నారాయణ ఆనం రామనారాయణ రెడ్డి అలగే నెల్లూరు నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మామిడాల మధు కలిసి సమావేశంలో పాలుగోనారు...



# హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

## ఆస్తివివాదమే హత్యకు కారణం

## వివరాలు వెల్లడించిన కావలిడిఎస్పి శ్రీధర్

కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 9
కావలి రూరల్ మండలం రుద్రకోట ఎస్సీ కాలనీలో రైల్వే ఉద్యోగి ఆరే నాగరాజును హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు కావలి డి.ఎస్.పి శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆయన కావలి డిఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి నాగరాజు హత్యకు గల కారణాలను వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆస్తి వివాదమే నాగరాజు హత్యకు కారణమని స్పష్టం చేశారు. చినగంజాం కు చెందిన మాధవి అనే మహిళతో 28 సంవత్సరాల క్రితం నాగరాజుకు వివాహం జరిగిందన్నారు. వారికి ముగ్గురు కుమారులు ఉన్నారని అన్నారు. గత పది సంవత్సరాలుగా నాగరాజు భార్య మాధవి భర్తకు దూరంగా ఉంటూ చిన్నగంజాం లోనే ఉంటుందన్నారు. ఇటీవల రుద్రకోటలో ఉన్న ఇంటిని అమ్మడానికి మాధవి ప్రయత్నించగా భర్త నాగరాజు దాన్ని అడ్డుకున్నాడని తెలిపారు. దీంతో మాధవి, రెండో కుమారుడైన నవీన్ లు నాగరాజును రోకలి బండతో కొట్టి హత్య చేశారని అన్నారు. హత్యకు కారకులైన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. హత్య కేసును చేదించిన కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్సైలు బాజీ బాబు, తిరుమల రెడ్డిలను డీఎస్పీ శ్రీధర్ అభినందించారు.

# మట్టి పెళ్ళలు పడి కార్మికుడు మృతి.

తిరుపతి, పెన్ పవర్, ఫిబ్రవరి 9.
వేదాంతపురం పంచాయితీలోని ఓ భవన నిర్మాణం చేపడుతుండగా మట్టి పెల్లలు కార్మికుడి పై పడి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ వివరాల మేరకు..... ప్రసాద్ అనే యజమాని భవనాన్ని నిర్మించేందుకు మట్టిని తొలగించాడు. తగ్గు ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులలో ఒక కూలి పై మట్టి గుట్ట ఒక్కసారిగా కూలడంతో మృతి చెందాడు. మృతుడు రేణిగుంట మండలంలోని భగత్ సింగ్ కాలనీకి చెందిన వీరేష్ (25)గా గుర్తించారు. మట్టిలో కూరుకున్న మృతుడిని వెలికి తీసేందుకు జెసిబి సాయంతో మట్టిని తొలగించి వెలికి తీశారు. విషయం తెలుసుకున్న కార్మిక సంఘాలు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడికి నష్టపరిహారం చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు పోలీసులు. వీరేష్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుచానూరు ఎస్సై అరుణ తెలిపారు.



# 4.12 కోట్లతో 24 గంటల త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే డా.పాశిం సునీల్ కుమార్

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,09:
వాకాడు సబ్ స్టేషన్ నందు ఆర్డిఎస్ఎస్ పథకం కింద దాదాపు రూ.4 కోట్ల 12 లక్షల వ్యయంతో మండలంలోని పలు గ్రామాలకు 24 గంటల త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా పథకాన్ని శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలో అనేక సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వాకాడు సబ్ స్టేషన్ పరిధిలో నెల్లిపూడి, వెంకటరెడ్డిపాళెం, సిధిగుంటపాళెం, కానేపల్లి, కల్లూరు, ముట్టెంబాక, కల్లూరు కొత్తపాళెం, దుగ్గవరం గ్రామాలకు రూ.1.5 కోట్లతో 24 గంటల త్రీ ఫేస్ విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పల్లంపర్తి సబ్ స్టేషన్ పరిధిలో నిడిగుర్తి ఫీడర్ ద్వారా 30 గ్రామాలకు రూ.2.5 కోట్లతో నిరంతర విద్యుత్ సరఫరా కల్పించామన్నారు. బాలిరెడ్డిపాళెం, దుగ్గరాజపట్నం, కొండూరు, వాలమేడు సబ్ స్టేషన్ల పరిధిలో పనులు కొనసాగుతున్నాయని, వీటికి మరో రూ.34 కోట్ల వరకు వ్యయం అవుతుందని తెలిపారు. వాకాడు మండలంలో 23 కొత్త ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు తీర ప్రాంతాల్లో 53 అగ్రికల్చరల్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసి 214 సర్వీసులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అగ్రికల్చర్‌కు పగటిపూట 9 గంటల త్రీ ఫేస్ విద్యుత్, ఎస్సీఎస్టీ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, పిఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇది కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# చింతకొమ్మలను ఎందుకు విరిచారని ప్రశ్నించిన వ్యక్తిపై దాడి

పలమనేరు, పెన్ పవర్, ఫిబ్రవరి 09,
సొంత భూమిలోని చింతచెట్టు లోని చింతకొమ్మలను ఎందుకు విరిచారని ప్రశ్నించి నందుకే ఆ వ్యక్తిపై ముగ్గురు కలిసి దాడికి పాల్పడ్డారు. పలమనేరు నియోజకవర్గ పరిధి పెద్దపంజాని మండలం, వీరప్పల్లి పంచాయతీ, మారప్పల్లెలో సోమవారం ఉదయం చిన్నబ్బ తనయుడు గురుమూర్తి తన ఇంటివద్ద ఉండగా తనకు వర్తించిన భూమి నందున్న చింతచెట్టులోని కొమ్మలను అనవసరంగా అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం మరియు ఆయన కుమారులు బాలాజీ, శేఖర్ జేసీబీ సాయంతో విరిచేశారు. దీనిపై స్పందించిన బాధితుడు గురుమూర్తి తనకు చెందిన చింత చెట్టులోని కొమ్మలను ఎందుకు విరిచారని అడిగే లోపే కోపంతో ఊగిపోయిన సుబ్రహ్మణ్యం ఆయన కుమారులు బాలాజీ, శేఖర్ కలసి ఒక్కసారిగా గురుమూర్తిపై పిడిగుద్దులు గుద్దడమే కాకుండా, అసభ్యకరంగా దూషణలు పర్వం అందుకున్నారు. గ్రామంలో మేము ఏమైనా చేస్తామని, అంతా తాము చెప్పినట్లు జరగాలని, లేకపోతే అందరి ప్రాణాలను తీసేస్తామని తనను బెదిరించినట్లు బాధితుడు గురుమూర్తి తెలిపారు. దాడి జరుగుతుండగా గ్రామస్తులు మరియు ఆయన కుటుంబ సభ్యులు అడ్డుపడి గురుమూర్తి ని పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. దాడిలో గురుమూర్తికి ఉదరంపై గట్టిగా లోపలి గాయాలు అయినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై పెద్దపంజాని పోలీసులకు కూడా పిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. దీనిపై అధికారులు చొరవ తీసుకుని తనకు న్యాయం చేయాలని భాదితుడు గురుమూర్తి కోరుతున్నారు



# రమేష్ రెడ్డి నగర్ ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలి: బీజేపీ డిమాండ్



నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 9.
ఫతేఖాన్‌పేటలో పార్కు అభివృద్ధికి బీజేపీ వినతి అన్యాక్రాంతం కాకముందే ఖాళీ స్థలాన్ని పార్కుగా మార్చాలి: ఫణిరాజురమేష్ రెడ్డి నగర్‌లో పార్కు ఏర్పాటు చేయాలని రూరల్ ఎమ్మెల్యే మరియు కమిషనర్ కు, వినతి ఫతేఖాన్‌పేటలోని రమేష్ రెడ్డి నగర్‌లో ఖాళీగా ఉన్న పార్కు స్థలాన్ని వెంటనే అభివృద్ధి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణిరాజు డిమాండ్ చేశారు. స్థానికులతో కలిసి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారికి, అలాగే నెల్లూరు నగర్ కమిషనర్ గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాకసిరి ఫణిరాజు మాట్లాడుతూ, రమేష్ రెడ్డి నగర్ పరిధిలో రవీంద్ర భారతి స్కూల్ ఎదురుగా ఉన్న ఎల్ పి నంబర్ 433/86, సర్వే నంబర్లు 473, 474-2, 475/పి 1459-2 పరిధిలో మొత్తం 6 ఎకరాల 55 సెంట్ల విస్తీర్ణంలో 91 సెంట్లను పార్కు కోసం కేటాయించారు. అయితే ప్రస్తుతం ఆ స్థలం ఖాళీగా ఉండడంతో అన్యాక్రాంతానికి గురయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల ఆ స్థలాన్ని వెంటనే పార్కుగా అభివృద్ధి చేసి, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, పిల్లలకు ఆట వస్తువులు, పెద్దలకు వాకింగ్ ట్రాక్, లైటింగ్ సౌకర్యం, చెట్లు, శుభ్రత వంటి ఏర్పాట్లు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ఇది స్థానిక ప్రజలకు ఎంతో అవసరమైన ప్రజాప్రయోజన అంశం. కాబట్టి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి" అని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, నీలగిరి సంఘం మండల అధ్యక్షులు మల్లిరవి, బీజేపీ నాయకులు చిలక ప్రవీణ్ కుమార్, చిలక ప్రదీప్, తిరువీధి నారాయణ, స్థానికులు సుమన్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చిరెడ్డిపాలెం నందు బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22న మంగళగిరిలో జరగబోవు బీసీ సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 9.
ఈనెల 22వ తేదీ గుంటూరు నాగార్జున యూనివర్సిటీ ఎదురు ప్రాంగణంలో బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో జరగనున్న బీసీ సింహ గర్జన గోడ రుతులను బుచ్చిరెడ్డిపాలెం నందు ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఎగ్జిక్యూటివ్ మెంబర్ వేల్పుల రామ్మోహన్ యాదవ్, నక్క దినేష్ యాదవ్, రాష్ట్ర యూత్ కో కన్వీనర్లు తిపిరిబోయిన రమేష్ యాదవ్, లీలా కృష్ణ యాదవ్ యూత్ జిల్లా కోకన్వీనర్ కొణిదెల నాగేంద్ర, స్థానిక బుచ్చిరెడ్డిపాలెం బీసీవై పార్టీ యువ నాయకులు ఉదయ్ కిరణ్, కర్పూరి ఠాకూర్ ఫౌండేషన్ సభ్యులు శ్రీ కుమార్ దంపతులు, మరియు వివిధ బీసీ, కుల, సంఘాలుపాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.





# గిరిజన గ్రామంలో సేవా దీపం వెలిగించిన శ్రీ సత్య సాయి బాబా సేవ సమితి.



శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,ఫిబ్రవరి, 09 :
శ్రీకాళహస్తి పరిధిలో సేవా కార్యక్రమం చేపట్టిన శ్రీ సత్య సాయి బాబా సేవ సమితి వేదాం చిన్నమిట్ట కండ్రిగ గిరిజన గ్రామాన్ని దత్తత తీసుకుని మహిళలు, విద్యార్థులకు అవసరమైన వస్తువులు ఉచితంగా అందించి ఆదర్శంగా నిలిచింది.శ్రీ సత్య సాయి బాబా వందల జన్మదిన కానుకగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 108 గిరిజన గ్రామాలను వివిధ సేవా సంస్థలు దత్తత తీసుకోగా, అందులో భాగంగా ఈ గ్రామంలో మహిళలకు కొత్త చీరలు, స్కూల్ విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో కన్వీనర్ పాండురంగయ్య, చంగయ్య, లలితమ్మ, పూర్ణిమ, మంజుల తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ముస్లిం అభివృద్ధికి వక్ఫ్ స్థలాలు వినియోగించాలి - కలెక్టర్‌కు వైఎస్ఆర్సీపీ వినతి.



తిరుపతి , పెన్ పవర్ ఫిబ్రవరి ,09 :
మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు వి. ఖాదర్ బాషా మార్గదర్శకత్వంలో, రాష్ట్ర వైఎస్ఆర్సీపీ సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ బాషా ఆధ్వర్యంలో మైనార్టీ విభాగం నాయకులు శుక్రవారం తిరుపతిలో ఆందోళన వ్యక్తం చేశారు.
జిల్లాలోని వక్ఫ్ బోర్డు భూములను ముస్లింల అభ్యున్నతి, అభివృద్ధికి ఉపయోగించకుండా కోట్ల రూపాయల విలువైన స్థలాలను నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ అంశంపై తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో ఏఓ రామాంజునేయాలు నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్సీపీ సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ బాషా, రాష్ట్ర మైనార్టీ సెల్ పార్టీ కార్యదర్శి ఎస్. రఫీ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ షర్మిలతో పాటు మైనార్టీ నాయకులు షేక్ బాషా, ఎస్. సుభాని, ఎస్. మస్తాన్, ఎస్. పేరు సాహెబ్, ఎస్. ఇలియాస్, షేక్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు



# అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా చంద్రబాబు పాలన

## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం - ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 9
రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన కొనసాగుతుందని, గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన జలదంకి మండలంలో పర్యటించారు. మండల కన్వీనర్ మునగాల తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే కు అడుగడుగునా పూలు చల్లుతూ ఆత్మీయ స్వాగతం పలికారు. గోపన్నపాలెం గ్రామంలో 50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం 68 లక్షల నిధులతో కమ్మ పాలెం కనెక్టివిటీ సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం లో పాల్గొన్నారు. కమ్మ పాలెం గ్రామంలో టిడిపి నాయకుడు గంట అశోక్ భారీ గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ల సమర్థ నాయకత్వం, సహకారంతో కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలో గత 30 సంవత్సరాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న అనేక గ్రామాలకు కూడా కూటమి ప్రభుత్వం



ఏర్పడిన తర్వాత పంచాయతీరాజ్ శాఖ నిధుల ద్వారా రోడ్ల నిర్మాణాలకు మంజూరు చేస్తూ, అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతోందని పేర్కొన్నారు.గ్రామాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మరింత చేరువవుతాయని, రైతులకు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు సులభంగా తరలించే అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. గోపన్నపాలెం,కమ్మపాలెం గ్రామాల్లో నిర్మించిన సిమెంట్ రోడ్లు గ్రామాభివృద్ధికి మైలురాయిగా నిలుస్తాయని, ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గోపన్నపాలెం గ్రామంలో తాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన గ్రామంలో, ఎస్సీ కాలనీలో ఆర్ఓ ప్లాంట్ల ను ఏర్పాటు చేస్తామని తెలిపారు అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు, పక్కా గృహాలు అందేలా చూస్తామన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్ బాబు, జనసేన



అధినేత పవన్ కళ్యాణ్ ల నాయకత్వాలకు మద్దతిస్తూ వచ్చే 2029 లోను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా కూటమి పార్టీలతో సమిష్టి కృషి చేద్దామని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, సోమశిల ప్రాజెక్టు వైస్ చైర్మన్ పులిగుంట మధుమోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు ఒంటేరు జయచంద్ర రెడ్డి, పూనూరు భాస్కర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ అప్పలనాయుడు, డైరెక్టర్లు మధుసూదన్ రెడ్డి, జానీ, టిడిపి మహిళా నాయకురాలు అనురాధ, టిడిపి నాయకులు పున్నం రోసిరెడ్డి, నక్క మాధవరావు గంట అశోక్, పచ్చ పెంచల్ నాయుడు, కంచర్ల వినోద్ నాయుడు, వర్ధిని మురళి నాయుడు, తహసిల్దార్ సీతామహాలక్ష్మి, టిడిపి, బిజెపి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అరాచక శక్తులను ఏరివేయండి - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు పెన్ పవర్ ఫిబ్రవరి 9.
గుమ్మళ్ళదిబ్బలో బాధిత కుటుంబానికి పరామర్శ.ఆడపిల్లలపై అన్యాయం జరిగితే ఉపేక్షించే ప్రసక్తే లేదు గుమ్మళ్ళదిబ్బలో నైట్ పెట్రోలింగ్ పెంచండి.
హై స్కూల్ వద్ద తక్షణమే సీసీ కెమెరాలను ఏర్పాటు.
కోవూరు పంచాయతీ పరిధిలోని గుమ్మళ్ళదిబ్బలో మైనర్ బాలిక మృతి చెందడం దురదృష్టకరమన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గుమ్మళ్ళదిబ్బ జె ఎస్ ఆర్ కాలనీలోని మృతురాలి కుటుంబాన్నికలిసి ఆమె పరామర్శించారు. మైనర్ బాలిక మరణానికి కారకులైన అరాచక శక్తులను ఏరివేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పోలీసులను ఆదేశించారు. మైనర్ బాలిక మృతికి కారణమైన నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామని, వారికి చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు.బాధిత కుటుంబానికి ఇప్పటికే పోలీసు



రక్షణ కల్పించామని, ప్రభుత్వం తరపున మరియు వ్యక్తిగతంగా తాను బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి భరోసా ఇచ్చారు.
స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద తక్షణమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఆడపిల్లల భద్రత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పరామర్శ అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ పిల్లలతో మాట్లాడి భద్రతపై అవగాహన కల్పించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు లేదా ఆపదలో



ఉన్నప్పుడు వెంటనే 112 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఆడపిల్లలకు అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి ఇంత మల్లారెడ్డి టిడిపి జిల్లా కార్యదర్శి యాకసిరి వెంకట రవణమ్మ బెజవాడ వంశీకృష్ణారెడ్డి మండల అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి మైనార్టీ నాయకులు జహంగీర్ జమీర్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు

# ఐక్యతే సమాధానం ఏఐసియు క్రైస్తవ కార్యాచరణ

సంఘం పెన్ పవర్ ఫిబ్రవరి 9.
సంగం మండలం, గాంధీజన సంగం: తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవులపై దాడులు తీవ్రంగా మారుతున్నాయి! సువార్తికులు, సంఘాలు లక్ష్యంగా చేసుకునే ఈ దాడులు మొత్తం సమాజాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఐక్యతే ఏకైక మార్గమని ఆల్ ఇండియా క్రిస్టియన్ యూనిటి (ఏఐసియు) సమావేశంలో నాయకులు స్పష్టం చేశారు.గాంధీజనసంఘంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన క్రైస్తవ ఐక్య కార్యాచరణలో "ఐక్యతే బలం" అనే సందేశం గల్లికి వచ్చింది. విడివిడిగా స్పందించకుండా అందరూ ఒకే స్వరంతో నిలబడాలని ఏఐసియు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ జాన్సన్ పిలుపునిచ్చారు. "ప్రభుత్వాలు, వ్యవస్థలు దృష్టి పెట్టాలంటే క్షేత్రస్థాయి నుంచే ఐక్యత బలపడాలి" అని అన్నారు.అనంతరం ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గాల్లో ఏఐసియు యువ విభాగానికి కొత్త నాయకత్వం ప్రకటించారు. యన్. అరవింద్, యమ్. దానియేల్‌లకు బాధ్యతలు అప్పగించారు. యువత చైతన్యం లేకుండా ఉద్యమం సాగదని నాయకులు హైలైట్ చేశారు.దాడులు ఖండించడంతో పాటు చట్టపరమైన పోరాటాలు, ప్రజాస్వామ్య మార్గాల్లో ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయం. ఈ దిశగా ఏఐసియు కార్యాచరణ విస్తరిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ఏఐసియు రాష్ట్ర అధ్యక్షుడు యన్. రవికుమార్, గౌరవ అధ్యక్షుడు పి. దేవదానం, లీగల్ అడ్వైజర్ సిహెచ్.రాజేష్, మహిళా విభాగం జె. రూతమ్మ, మండల నాయకులు జి.సుధీర్, టి.ఎజ్రా, సిహెచ్. విజయ్ బాబు, షేక్.ఇమ్మానియేల్ పాల్గొన్నారు.విభజన కాదుడ ఐక్యతే సమాధానం! రాబోయే రోజుల్లో ఈ ఐక్యత చర్యలు పుంజుకుంటాయని నిర్వాహకులు ధీమా వ్యక్తం చేశారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రైవేటు వ్యక్తుల కోసమే రోడ్డు డైవర్ట్ చేశారా?

## - ప్రతిఫలంగా చేతులు మారిన లక్షల రూపాయలు

పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 09,
గంగవరం మండల కేంద్రంలోని కూర్నిపల్లె రోడ్డును ప్రైవేటు వ్యక్తుల కోసమే రాత్రికి రాత్రే డైవర్ట్ చేశారని, ఇందుకు ప్రతిఫలంగా కొంతమంది అధికార పార్టీ నాయకులకు లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది.గతంలో ఇక్కడ అత్యంత సురక్షితంగా ఓంశక్తి దేవాలయాన్ని ఆనుకొని వెళ్తున్న రోడ్డును,రాత్రికి రాత్రే మార్చివేశారు. సర్వే నెంబర్ 317-1,2 రెవెన్యూ దాఖలాలోని రోడ్డును ఎటువంటి అధికారుల అనుమతి లేకుండా అధికార పార్టీ నాయకుల ఇష్టారాజ్యంగా,అత్యంత ప్రమాదకరంగా ఉన్న 33 కేవీ విద్యుత్ వైర్ల క్రిందకు రోడ్డును మార్చడమే కాకుండా ఇక్కడే బీటీ రోడ్డు కూడా వేయడం మరో కొసమెరుపు.

**నాయకులకు చేరిన లక్షలాది రూపాయలు ?**

గతంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉన్న రోడ్డును డైవర్ట్ చేసి,అందులో బీట్ రోడ్డు వేసేందుకు అన్ని విధాలా సహకరించిన అధికార పార్టీ పెద్దలకు సుమారు 10లక్షల రూపాయలకు పైగా చేరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇందులో ఒకరు నియోజకవర్గ ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితులు కాగా, మరొకరు మండల స్థాయి నాయకులు ఉన్నారని,ఇందులో మరికొంత మంది ప్రమేయం కూడా ఉందని తెలుస్తోంది.ఈ విషయం ఇప్పటివరకూ ఎమ్మెల్యేకు తెలియకపోవడం ఒకింత ఆశ్చర్యం కలిగిస్తోంది.



# మళ్లీ ఎలక్షన్ ఫీవర్.. స్థానిక సంస్థలకు ఎన్నికలు.

**విజయవాడ, ఫిబ్రవరి 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కసరత్తు ప్రారంభమైంది. ఓటర్ల జాబితా తయారీ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. జనవరి ఒకటో తేదీ ప్రామాణికంగా ఓటర్ల జాబితా నవీకరించాలని.. మార్చి 9వ తేదీ నాటికి ఓటర్ల తుది జాబితా ప్రకటించాలని కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. మరోవైపు ఏపీలో మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో ముగియనుంది. అలాగే గ్రామ పంచాయతీలో పదవీకాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుంది.ఏపీలో మళ్లీ ఎన్నికల హడావిడి మొదలు కానుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలైంది. ఒకటి రెండు నెలల్లో ఏపీలోని పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా కొత్త ఓటర్ల జాబితా రూపకల్పన కోసం ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం నోటిఫికేషన్లు జారీ చేసింది. ఓటర్ల జాబితా తయారీని వెంటనే ప్రారంభించాలని.. మార్చి నెల 9వ తేదీన ఫోటోలతో సహా ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ నీలం సాహ్ని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు సీఈవో కార్యాలయం నుంచి అసెంబ్లీల వారీగా ఓటర్ల జాబితాలు సేకరించిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఆ వివరాలను సర్వర్లలో రికార్డు చేసింది.మరోవైపు మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులకు లాగిన్లు ఇచ్చారు. ఈ లాగిన్ల ద్వారా జాబితాలు సేకరించుకుని.. వాటిలో నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగానే ఓటర్ల జాబితా తయారు చేయనున్నట్లు తెలిపింది. 2026 జనవరి ఒకటో తేదీని ప్రామాణికంగా తీసుకుని ఓటర్ల జాబితా అప్ డేట్ చేయాలని సూచించింది.ఏపీలో 123 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. 87 నగర పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం మార్చి 17తో ముగుస్తుంది. ఇక 36 పట్టణ స్థానిక సంస్థలలో కోర్టు కేసులు, ఇతర కారణాలతో ఎన్నికలు జరగలేదు. ఈ నేపథ్యంలోనే ఈ రెండూ కలిపి 123 పట్టణ స్థానిక సంస్థలలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.వీటిలోని వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితా తయారు కానుంది. అలాగే ఏపీలోని 13,098 పంచాయతీల పదవీ కాలం ఏప్రిల్ రెండో




తేదీతో ముగియనుంది. 253 పంచాయతీల్లో వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించలేదు. తాజాగా మొత్తంగా 13,351 పంచాయతీలలోనూ ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల జాబితా సిద్ధం చేయనున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## టీడీపీలో ఫైర్ బ్రాండ్ మహిళా లీడర్లు

**విజయవాడ, ఫిబ్రవరి 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ విజయ పరంపరకు మహిళా నేతలు నేడు అసలైన పిల్లర్లుగా నిలుస్తున్నారు. ముఖ్యంగా రెడ్డప్పగారి మాధవీరెడ్డి, మంత్రి సవిత, హోంమంత్రి వంగలపూడి అనిత, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, మంత్రి సంధ్యారాణి వంటి నేతలు నేడు అసెంబ్లీలోనూ, బయటా తమ గళాన్ని వినిపిస్తూ ప్రత్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. వీరిలో కొందరు రాజకీయ వారసత్వంతో వచ్చినా, మరికొందరు సామాన్యులుగా రాజకీయాల్లోకి వచ్చినా.. తమదైన శైలిలో అరాచక శక్తులపై పోరాడుతూ పార్టీలో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్నారు.రాయలసీమ గడ్డపై భూమా అఖిలప్రియ, గౌరు చరిత రెడ్డి వంటి వారు చూపుతున్న తెగువ రాజకీయాన్ని మరో స్థాయికి తీసుకువెళ్లింది. అరాచక పార్టీగా ముద్రపడిన వైసీపీ నాయకుల బెదిరింపులకు వెరవకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలకు అండగా నిలవడంలో వీరు ముందుంటున్నారు. అలాగే గౌతు శిరీష, యువ నేత బండారు శ్రావణి శ్రీ వంటి వారు తమ వాగ్ధాటితో, కార్యదక్షతతో మెరుస్తున్నారు. వీరంతా కేవలం పదవుల కోసం కాకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న తీరు టీడీపీని మహిళా పక్షపాత పార్టీగా గట్టిగా నిలబెట్టింది. గత ప్రభుత్వ హయాంలో వీరు ఎదుర్కొన్న వేధింపులు, పెట్టిన అక్రమ కేసులు వీరిని మరింతగా రాటుదేల్చాయే తప్ప ఎక్కడా వెనక్కి తగ్గించలేకపోయాయి.చంద్రబాబు నాయుడు దూరదృష్టితో టీడీపీలో మహిళలకు లభిస్తున్న ప్రాధాన్యత నేడు ఫలితాలను ఇస్తోంది. నారీ శక్తి ని కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, నిర్ణయాధికారాల్లో భాగస్వాములను చేయడం వల్లే వీరు స్వతంత్రంగా , ధైర్యంగా తమ నిర్ణయాలను వెల్లడించగలుగుతున్నారు. ఈ ఫైర్ బ్రాండ్ మహిళా నేతలు చూపిస్తున్న చురుకుదనం సోషల్ మీడియాలో సైతం సెన్సేషన్ సృష్టిస్తోంది. తమ మీద దాడి జరిగినా, వ్యక్తిత్వ హననానికి పాల్పడినా.. రెట్టింపు వేగంతో కౌంటర్ ఇస్తూ ప్రత్యర్థి పార్టీలకు చుక్కలు చూపిస్తున్నారు.ఏపీ రాజకీయాల్లో ఈ మహిళా నేతలు ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. వీరంతా రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థాయికి ఎదుగుతారనడంలో ఎలాంటి సందేహం లేదు. టీడీపీ బలోపేతానికి వీరు చేస్తున్న కృషి, పార్టీకి ఇస్తున్న నైతిక బలం వెలకట్టలేనిది. ధైర్యానికి నిలువుటద్దంలా నిలుస్తూ, ప్రజాసేవలో దూసుకుపోతున్న ఈ మహిళా మణులు తెలుగు జాతి గర్వించదగ్గ నాయకురాళ్లుగా గుర్తింపు పొందుతున్నారు. అరాచకంపై వీరు సాగిస్తున్న ఈ ధర్మ యుద్ధం రాష్ట్ర ప్రగతికి , మహిళా సాధికారతకు ఒక గొప్ప నిదర్శనం.

## స్థానిక ఎన్నికలు బహిష్కరణ ఆలోచనలు?

**విజయవాడ, ఫిబ్రవరి 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. మున్సిపల్, పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియగానే, వాటిని స్పెషల్ ఆఫీసర్ల పాలనలోకి వెళ్లనివ్వకుండా వెంటనే ఎన్నికలు జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృతనిశ్చయంతో ఉన్నారు. ముందుగా గ్రామ పంచాయతీలకు, ఆపై పరిషత్ ఎన్నికలకు, చివరగా మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూల్‌ను సిద్ధం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈ నిర్ణయం ప్రతిపక్ష వైసీపీని తీవ్ర ఆందోళనలోకి నెట్టింది.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఈ ఎన్నికలు వైసీపీకి పెను సవాలుగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ క్యాడర్ ఇంకా కోలుకోలేదు. ఈ తరుణంలో ఎన్నికలకు వెళ్తే పరాభవం తప్పదనే భయం పార్టీ నేతల్లో కనిపిస్తోంది. ఇప్పటికే పార్టీలోని కొన్ని వర్గాలు ఈ ఎన్నికలను బహిష్కరించాలనే తీవ్ర ఆలోచన చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఒకసారి ఎన్నికలను బహిష్కరిస్తే గ్రామస్థాయిలో క్యాడర్ పూర్తిగా నిస్తేజమైపోతుందని, అది పార్టీ ఉనికికే ప్రమాదమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.పోటీ చేస్తే ఓటమి భయం, తప్పుకుంటే క్యాడర్ దూరం.. ఈ విచిత్ర పరిస్థితి నుంచి బయటపడటానికి వైసీపీ న్యాయపోరాటాన్ని ఆశ్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు లేదా ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కోర్టుల్లో పిటిషన్లు వేసి ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఎన్నికలను వాయిదా వేయడానికి చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టిన అనుభవం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఎన్నికలను ఆలస్యం చేయడమే శ్రేయస్కరమని ఆ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.మరోవైపు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు ఈ ఎన్నికల కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాయి. గ్రామాల్లో పట్టు పెంచుకోవడానికి ఇది సువర్ణావకాశమని భావిస్తున్న కూటమి నేతలు, క్షేత్రస్థాయిలో ప్రచారానికి సిద్ధమవుతున్నారు. వైసీపీ తన వ్యూహాలను మార్చుకోకపోతే, పంచాయతీ నుంచి మున్సిపాలిటీ వరకు ఏకపక్ష ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి ఏపీ స్థానిక ఎన్నికలు కేవలం పదవుల కోసం కాకుండా, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం తన ఉనికిని కాపాడుకోవడానికి చేసే జీవన్మరణ పోరాటంగా మారనున్నాయి.

## సామాజిక వర్గాన్ని నమ్ముకున్న వైసీపీ...

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 9, పెన్ పవర్:** ఏదైనా ఒక్కసారి చేస్తేనే వర్క్ అవుట్ అవుతుంది. పదే పదే అదే మాట అంటే ప్రజలు వినరు. తెలంగాణలో కెసిఆర్ ని తీసుకుందాం. రెండుసార్లు తెలంగాణ సెంటిమెంట్తో ఎన్నికలకు వెళ్లి గెలిచారు. కానీ మూడోసారి మాత్రం సెంటిమెంట్ తగ్గించి.. జాతీయ భావాలతో వెళ్లారు. అయినా సరే అక్కడి ప్రజలు గుర్తించలేదు. ఏపీలో కూడా అటువంటి సీన్ ఉంది. ఎందుకంటే జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఎన్నో రకాల ప్రయోగాలు చేశారు. అందులో కులప్రయోగం ఒకటి. 2014లో కాపులకు రిజర్వేషన్లు ఇస్తానని ప్రకటించారు చంద్రబాబు. ఆ ఒక్క అంశాన్ని పట్టుకొని ముద్రగడ పద్మనాభం పెద్ద ఉద్యమమే చేశారు. అది అంతిమంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చింది. కానీ అదే ముద్రగడ పద్మనాభం వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమాన్ని వదిలేశారు. అదే ముద్రగడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినా మొన్నటి ఎన్నికల్లో కాపులు ఇటువైపు చూడలేదు.కాపు రిజర్వేషన్ ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారు ముద్రగడ పద్మనాభం. 2016 జనవరి 31న తుని కేంద్రంగా ముద్రగడ నేతృత్వంలో కాపు గర్జన సభ ఏర్పాటు చేశారు. చివరకు ఆ ఉద్యమం రైలు తగలబెట్టే వరకు వచ్చింది. ముద్రగడపై కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా తీసుకున్న కొన్ని రకాల నిర్ణయాలు కాపులను ఆకర్షించాయి. నాడు ముద్రగడపై తెలుగుదేశం ప్రభుత్వం పెట్టిన కేసులను కాపు కులం పై జరిగిన దాడిగా చిత్రీకరించడంలో జగన్మోహన్ రెడ్డి సక్సెస్ అయ్యారు. తద్వారా అప్పట్లో టిడిపి పొలిటికల్ గా భారీ డ్యామేజ్ కు గురైంది.అయితే తాజాగా అంబటి రాంబాబు అరెస్టు ఎపిసోడ్ ను కాపులపై జరుగుతున్న దాడిగా చిత్రీకరించేందుకు మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాపులంటే చంద్రబాబుకు ఎందుకంత కక్ష? కాపు సామాజిక వర్గం నేతల మీద టిడిపి దాడులు ఏంటి? నాడు ముద్రగడపై అలా? నేడు అంబటి రాంబాబు పై ఇలా? అంటూ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విశాఖ నుంచి సంఘీభావ యాత్ర మొదలు పెట్టేసారు. 300 కార్లతో యాత్రగా బయలుదేరారు. " నాడు ముద్రగడ మాదిరిగా అంబటి రాంబాబు ఎపిసోడ్ వర్కౌట్ కాదు. కూటమి పార్టీల తరఫున ఉన్న కాపు నేతలు మౌనం మరోసారి డ్యామేజ్ కు గురి చేసే అవకాశం ఉంది. ముద్రగడ రిజర్వేషన్ ఉద్యమాన్ని.. అంబటి రాంబాబు వ్యాఖ్యలను ఒకే గాటిలో కట్టలేం. కానీ ఎలాగైనా కాపులను మరోసారి తనవైపు తిప్పుకోవాలన్న జగన్మోహన్ రెడ్డి ఆలోచనలను కూటమి కాపు ఎమ్మెల్యేలు, మంత్రులు గుర్తించాల్సిన అవసరం ఉంది. తిప్పి కొట్టాల్సిన పరిస్థితి ఉంది. సామాజిక వర్గానికి చెందిన వంగవీటి రంగాను హత్య చేశారని, ముద్రగడ పద్మనాభాన్ని అనేక రకాలుగా వేధించారని, ఇపుడు అంబటి రాంబాబు మీద దాడి చేసి తిరిగి ఆయన మీద తప్పుడు కేసులు పెట్టారంటూ" కాపు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్న

# ఎక్స్ కిరణాల ఆవిష్కర్త రాంట్జెన్

**హైదరాబాద్ పెన్ పవర్:** 19 వ శతాబ్దం సంచలనాత్మక శాస్త్రీయ ఆవిష్కరణలకు స్వర్ణ యుగం. అలాంటి యుగంలో భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్జెన్ ఒక వింతను కనుగొన్నాడు, దానిని చాలా మంది నమ్మలేదు. రాంట్జెన్ యొక్క ఆవిష్కరణ వార్తలు జనవరి 1896 ప్రారంభం నుండి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించాయి. శాస్త్రవేత్తలు సైతం నివేదికలను ప్రాక్టికల్ జోకర్ ఉపాయం అని కొట్టి పారేశారు.రోగ నిర్ధారణకు కొత్త ఒరవడిని సృష్టించి, ప్రపంచంలో వైద్య రంగంలో రోగ నిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరఫీ) కొరకు ఉపయోగించే ఎక్స్ కిరణాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త విల్హెల్మ్ కన్రాడ్ రాంట్జెన్. ఆయన కనుగొన్న ఎక్స్ కిరణాలు వైద్యరంగం లోనె కాక భద్రతా రంగంలో ఉపయోగ పడుతున్నాయి. విల్హెల్మ్ కన్రాడ్ రాంట్జెన్ (మర్చి 27,1845 – 1923 ఫిబ్రవరి 10) జర్మన్ దేశ భౌతిక శాస్త్ర శాస్త్రవేత్త. 1895 నవంబరు 8 న విద్యుదయస్కాంత తరంగాలలో వివిధ తరంగ దైర్ఘ్యాలుల అవధులలో గల ఎక్స్- కిరణాలను కనుగొన్నాడు. ఈ పరిశోధన వల్ల 1991 లో భౌతిక శాస్త్రంలో మొదటి సారి నోబెల్ బహుమతి పొందాడు. ఆయన చేసిన కృషికి గాను ఆవర్తన పట్టిక లో 111 పరమాణు సంఖ్య గల మూలకానికి రాంట్ జీనియమ్ అనిపేరు పెట్టి గౌరవించారు. రాంట్జన్ 1845 మార్చి 27 న జర్మనీలోని లెన్నెస్ లో జన్మించాడు. ఈయన తండ్రి ఒక రైతు. తల్లి ఒక డచ్ మహిళ. హాలెండ్ లో విద్యాభ్యాసం జరిగింది. 1865 లో యుట్రెచ్ యూనివర్సిటీ లో చేరుటకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కాని జూరిచ్ లో గల ఫెడరల్ పాలిటెక్నిక్ సంస్థలో చేరి పరీక్షలను ఉత్తీర్ణుడయ్యాడు. అక్కడ మెకానికల్ ఇంజనీరుగా చేరాడు. 1869లో తత్వ శాస్త్రములో జూరిచ్ విశ్వ విద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టాను పొందాడు. ఆ విశ్వ విద్యాలయంలో ప్రముఖ ప్రొపెసర్ అయిన ఆగస్టు కుండ్త్ కు ప్రియమైన శిష్యుడయ్యాడు. 1874 లో స్టాన్ ఫర్డు విశ్వ విద్యాలయంలో అద్యాపకునిగా నియమించ బడ్డాడు. 1875 లో హోహెనీం విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ గా, తర్వాత 1876 లో స్టాన్ ఫర్డు విశ్వ విద్యాలయంలో మరల అద్యాపకునిగా, 1888 లో గీసన్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యునిగా, తర్వాత వుర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో విధులు నిర్వర్తించాడు. 1900లో ప్రభుత్వ అభ్యర్థనపై మంచ్ యూనివర్సిటీలో చేరాడు. ఆయన కుటుంబం యు.ఎస్.ఎకు వలస వెళ్ళాలని నిర్ణయించు కున్నారు. న్యూయార్క్ లో కొలంబియా యూనివర్సిటీ వారు అవకాశం యిచ్చినప్పటికీ మొదటి ప్రపంచ

యుద్ధం కారణంగా తన శేష జీవితాన్ని మునిచ్ నందే గడిపాడు. 1895 వరకు ఉత్సర్గనాళ ప్రయోగాలలో హెర్జ్, జాన్ హిటార్ఫ్, విలియం క్రూక్స్, టెస్లా,లీనార్డో లతో పని చేశాడు. ఎక్స్ కిరణాలను రాయింట్ జన్ కిరణాలని అంటారు. కాని రాంట్జెన్ స్వయంగా వాటిని ఎక్స్ కిరణాలని పిలిచాడు.ఈ కిరణాలను కనుగొని లోకానికి పరోపకారం చేసినందుకు కృతజ్ఞతగా ఆయనకు 1901 లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభ్యమయింది. ఈ ఎక్స్ రే వెనుక ఎంతో ఆసక్తి కరమైన కథ ఉంది. రాయింట్ జన్ కేథోడ్ రే ట్యూబ్ (శూన్య గాజు నాళం) తో పరిశోధనలు చేసేవాడు. గది అంతా చీకటిగా ఉన్నప్పుడు యీ ట్యూబ్ గుండా కాంతి కిరణాలను పంపడం జరిగింది. పైగా ట్యూబ్ చుట్టూ నల్లని కాగితాన్ని కాంతి కిరణాలు ఏ కొంచెం కూడా వెలువడ కుండా కప్పి ఉంచాడు. ఇలా చేసినప్పటికి కాథోడ్ ట్యూబ్ కు సమీపంలో ఉన్న బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం వింత మెరుపులతో ప్రకాశించ సాగింది. నల్లటి కాగితాన్ని కప్పి ఉంచినప్పటికీ కాథోడ్ ట్యూబ్ నుంచి ఏవో అజ్ఞాత కిరణాలు వెలువడి బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం మీద పడి అది మెరిసేటట్లు చేసిందని ఆయన ఊహించగలిగాడు. ఈ కిరణాలను కాగితం గుండా, చెక్కగుండా, లోహపు పలకల గుండా ప్రయాణం చేయగలవని యీయన కనుగొన్నాడు. ఈ కిరణాలు కూడా ఓ రకమైన కాంతి కిరణాలే అని అయితే వీటి తరంగ దైర్ఘ్యం చాలా తక్కువ కావటం వల్ల మనుషుల కళ్ళకు కనిపించవని రాయింట్జన్ వెల్లడించాడు. మామూలు కాంతి కిరణాలే ఫోటోగ్రాఫిక్ ప్లేట్ల మీద ప్రభావం చూపుతూ ఉండగా, యీ కిరణాలు మాత్రం చూపకుండా ఉంటాయా అనే ఆలోచన రాయింట్ జెన్ కి రావటం – శాస్త్ర ప్రపంలో ఒక సరికొత్త అధ్యాయానికే కారణ భూతమైనది. ప్రయోగం చేయటం కోసం రాంట్జెన్ ఫోటో గ్రాఫిక్ ప్లేటు మీద తన భార్య చేతిని ఉంచి యీ కిరణాలను ప్రసారం చేసి ఫోటోను డెవలప్ చేసి చూసి ఆశ్చర్య పోయాడు. చేతి ఎముకలు ఉంగరంతో సహా ఆ ఫోటో లో వచ్చింది. చుట్టూ మాంసం ఉన్నట్లు మసక మసకగా ఉంది. అంటే సజీవంగా ఉన్న మనిషి కంకాళాన్ని ఈ కిరణాల ద్వారా ఫోటో తీయవచ్చని స్పష్టంగా తేలింది. దురదృష్ట వశాత్తు రాంట్జెన్, ఆయనతో కలిసి పనిచేసిన మరో ఇద్దరు పరిశోధకులు యీ ఎక్స్ కిరణాల తాకిడికే క్రమ క్రమంగా మరణించాడు. ఈ ఎక్స్–కిరణాల వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతున్నప్పటికీ వాటిని మితిమీరి వాడితే మాత్రం ప్రమాదం తప్పదని,యీ కారణంగానే ఎక్స్–కిరణాలను నిరంతరం గురి కాబట్టే రాంట్జెన్ ఆ కిరణాల ప్రభావంగానే చని పోయాడని రుజువైంది. రేడియో ధార్మికత నుండి రక్షించు కొనుటకు సీసపు కవచాలు వాడే కొద్దిమంది మార్గ నిర్దేశకులో ఆయన ఒకరు.ఆయన చేసిన ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు కూడా తీసుకోలేదు. నోబెల్ బహుమతిగా వచ్చిన ధనమును వర్జ్ బర్గ విశ్వ విద్యాలయమునకు విరాళంగా యిచ్చాడు. మొదటి ప్రపంచ యుద్ధం వల్ల యేర్పడే ద్రవ్యోల్బణం వల్ల రాంట్జెన్ చాలా పేదరికంలో మగ్గాడు. తన శేష జీవితాన్ని మునిచ్కి సమీపంలో గల విల్ హెల్మ్ లో గల యింటిలో గడిపాడు. ఆయన కోరిక ప్రకారం ఆయన వ్యక్తిగత, శాస్త్రమునకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆయన మరణం తర్వాత నాశనం చేయటం జరిగింది. 1901 లో రాంట్జెన్ కు మొదటి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చింది. ఈ బహుమతి ఆయన ఎక్స్ కిరణాలు కనుగొని విశేష సేవలందించినందుకు గాను యివ్వ బడింది. కాని రాంట్ జెన్ ఆ బహుమతికి వచ్చిన ఆర్థిక ప్రతిఫలాన్ని తన విశ్వ విద్యాలయమునకు దానమిచ్చాడు. పియరీ క్యూరీ వలే రాంట్జెన్ తన పరిశోధనకు పేటెంట్ హక్కులను తిరస్కరించాడు. మానవాళికి తన పరిశోధన యొక్క ఫలితాలు ఉపయోగకరంగా ఉండాలని, ఈ కిరణాలకు తన పేరు కూడా పెట్టరాదని కోరుకున్నాడు.

# సాఫ్ట్ గా మాధవ్.. ఇక పెరిగేది ఎలా

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 9, పెన్ పవర్:** దక్షిణాదిలో ఏపీలో మాత్రమే బీజేపీకి చెప్పుకోదగ్గ స్రెంథ్ లేదు. ఒంటరిగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా వచ్చే సీన్ లేదు. అందుకే కూటమిలో భాగంగా ఉంటూనే..నవ్యాంధ్రలో కమల వికాసం కోసం ఎత్తులు వేస్తున్నారు జాతీయ పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను నిర్వహించడం తప్ప.. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణం కోసం, క్యాడర్ బలోపేతం కోసం అధ్యక్షుడిగా మాధవ్ కొత్తగా చేస్తున్నదేమి లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధ్యక్షుడు చేపడుతున్న కొద్దిపాటి యాక్టివిటీకి కూడా పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల నుంచి కోఆపరేషన్ లేదని క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. 2019లో ఒంటరిగా పోటీ చేసి ఓట్లు తెచ్చుకోవడం తప్ప..ఒక్క సీటు కూడా గెల్వలేకపోయింది బీజేపీ. 2024కు వచ్చే సరికి కూటమిగా జత కట్టి..అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఉభయ సభల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం దక్కించుకుంది.కమలనాథులు.ఇప్పటికంటే ఇంకింత బలంగా..మరింత స్ట్రాంగ్‌గా నిలబడేందుకు సరికొత్త స్ట్రాటజీస్ ప్లే చేస్తున్నారు. అందుకే ఓ చేతిలో బీజేపీ జెండా..ఇంకో చేతిలో కూటమి అజెండాతో..కలిసి నడుద్దామ్. పార్టీ కోసం కష్టపడుదామంటూ ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పిలుస్తున్నారు. కానీ సీనియర్ లీడర్లలో మాత్రం ఆ దూకుడు కనిపించట్లేదట.అదే కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు దూసుకెళ్తున్న స్పీడుగా..కమలనాథులు ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నారట. దీంతో ఏపీలో బీజేపీ మినహా మిగతా రాజకీయ పార్టీలన్నీ యాక్టీవ్‌గానే ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. అధికార కూటమి కీలకంగా ఉన్న టీడీపీ..మళ్లీ పవర్‌లోకి రావాలని ఎత్తులు వేస్తున్న వైసీపీ..ఎక్కడా తగ్గట్లేదు. రేపే ఎలక్షన్స్ ఉన్నాయన్నట్లుగా ఆ రెండు పార్టీలు ఎప్పుడూ సూపర్ యాక్టీవ్‌గా ఉంటున్నాయి.జనసేన కూడా అటు పార్టీ నిర్మాణంలోనూ ఇటు పొలిటికల్‌గాను దూకుడు మీదుంది. చివరికి కాంగ్రెస్ పార్టీ కూడా ఏదొక హడావుడి చేస్తూనే ఉంటుంది. పార్టీకి క్యాడర్, లీడర్లు లేకపోయినా షర్మిల చేసే పొలిటికల్ కామెంట్స్ నిత్యం ప్రజల్లో చర్చనీయాంశం అవుతున్నాయి. కానీ ఏపీలో బీజేపీ మాత్రం అంత యాక్టీవ్‌గా కనిపించట్లేదన్న చర్చ ఉంది.ఏపీలో కూటమిలో భాగస్వామిగా ఉన్నా అటు ప్రభుత్వంలోనూ ఇటు పొలిటికల్ గాను పార్టీ యాక్టివిటీ చాలా తక్కువ. ఇక పార్టీ బలోపేతం కోసం, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బలమైన ప్రయత్నాలేమి జరగడం లేదని కార్యకర్తలే చర్చించుకుంటున్న పరిస్థితి. దీనికి కారణం బీజేపీ కీలక నేతలు సైలెంట్ మోడ్‌లో ఉండటమే అంటున్నారు.కేంద్రంలో అధికారంలో ఉంటూ..చాలా రాష్ట్రాల్లో పవర్‌లో కొనసాగుతూ..ఏపీ ప్రభుత్వంలో కీరోల్ ప్లే చేస్తున్నప్పటికీ..ఏపీలో మాత్రం ఆశించినంతగా కమలం లీడర్లు దూకుడు ప్రదర్శించడం లేదంటున్నారు. పక్కనే ఉన్న తెలంగాణలో బీజేపీ లీడర్లు అధికారంలోకి వచ్చేది తామేనని చెప్పుకుంటూ..అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌ను ఢీకొడుతూ ముందుకెళ్తుంటే..ఏపీ బీజేపీ లీడర్లు పార్టీని గాలికి వదిలేశారని క్యాడర్ బాణాలు ఎక్కుపెడుతోంది.ఏపీలో బీజేపీకి 12 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు, ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ఒక ఎమ్మెల్సీతో పాటు రాష్ట్ర ప్రభుత్వంలో ఒక మంత్రి ఉన్నారు. ఏపీ నుంచి గెలిచిన ముగ్గురు బీజేపీ ఎంపీల్లో భూపతిరాజు శ్రీనివాసవర్మ కేంద్రమంత్రిగా ఉన్నారు.



వీరికి తోడు పార్టీలో సీనియర్ నేతలు ఉన్నారు. వీరెవరూ పార్టీ బలోపేతం కోసం ప్రత్యేక చొరవ చూపట్లేదని కార్యకర్తలే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కేంద్రం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేలా ఎలాంటి యాక్టీవిటీ చేపట్టకపోవడంతో పాటు..పొలిటికల్ ఇష్యూస్‌పై కూడా ఒక్కరూ నోరెత్తకపోవడం చర్చనీయాంశంగా మారింది. లీడర్లే సైలెంట్ మోడ్‌లో ఉండటంతో ఏపీ బీజేపీపై ప్రజల్లో చర్చకే ఆస్కారం లేకుండా పోయిందంటున్నారు. అధ్యక్షుడిగా మాధవ్ ఉన్నప్పటికీ ఆయన వాయిస్ పెద్దగా ప్రజలోకి వెళ్లడం లేదనేది రాజకీయ వర్గాల్లో చర్చ.ఇలాంటి పరిస్థితుల్లో మెల్లగా పార్టీని బలోపేతం చేసుకుంటూ పోతే చట్టసభల్లో తమ ప్రాతినిధ్యాన్ని ఇంకా పెంచుకునే అవకాశం ఉంటుంది. కానీ ఆ దిశగా ఏపీ బీజేపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలేమి లేవంటున్నారు కార్యకర్తలు. త్వరలోనే స్థానిక, మున్సిపోల్స్ ఎన్నికలు రాబోతున్నాయి. స్థానిక, పురపోరు కోసం పార్టీని సన్నద్ధం చేసేందుకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ద్వితీయ శ్రేణి నేతలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారుఅధికారంతో సంబంధం లేకుండా పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలు..నేతలు..ఏపీ బీజేపీ నేతల తీరుపై తీవ్ర అసహనంతో ఉన్న పరిస్థితి. కూటమిలో టీడీపీ, జనసేన తమ పార్టీలను మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తుంటే బీజేపీ లీడర్లు మాత్రం పార్టీని పట్టించుకోవడమే మానేశారన్న విమర్శలు కమలం పార్టీలో కాక పుట్టిస్తున్నాయి.

# ప్రేక్షకాదరణలో ఫుట్‌బాల్ కింగ్.. రెండో స్థానంలో క్రికెట్

**ప్రేక్షకాదరణలో ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌దే అగ్రస్థానం**

**150 కోట్ల వీక్షణలతో ఫుట్‌బాల్ తిరుగులేని ఆధిపత్యం**

**రెండో స్థానంలో క్రికెట్ ప్రపంచకప్.. నాలుగో స్థానానికి పడిపోయిన సూపర్ బౌల్**

**డిజిటల్ వీక్షణలో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న ఐపీఎల్**

**అమెరికాలో సూపర్ బౌల్‌కు క్రేజ్ ఉన్నా.. ప్రపంచవ్యాప్తంగా వెనుకంజ**




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి ఏటా అమెరికాలో జరిగే సూపర్ బౌల్ ఈవెంట్ రాగానే, సోషల్ మీడియాలో ఓ పెద్ద చర్చ మొదలవుతుంది. ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడా ఈవెంట్ ఇదేనంటూ పాశ్చాత్య అభిమానులు వాదిస్తుంటారు. కానీ, వాస్తవ లెక్కలు చూస్తే ఈ వాదనలో వాస్తవం లేదని స్పష్టమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఫుట్‌బాల్ (సాకర్) తిరుగులేని రాజుగా నిలుస్తుండగా, డిజిటల్ వీక్షణలో క్రికెట్ వేగంగా దూసుకొస్తోంది. అమెరికాలో సూపర్ బౌల్‌కు ఎంత క్రేజ్ ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్త ప్రేక్షకాదరణలో దాని స్థానం చాలా వెనుక ఉంది.

**ఫిఫా ప్రపంచకప్.. తిరుగులేని ఆధిపత్యం**

ప్రపంచంలో అత్యధిక మంది చూసిన ఫైనల్స్‌లో ఫిఫా ప్రపంచకప్‌దే అగ్రస్థానం. 2022లో ఖతార్ వేదికగా అర్జెంటీనా, ఫ్రాన్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను ప్రపంచవ్యాప్తంగా సుమారు 150 కోట్ల మంది వీక్షించారు. ఫిఫా అధికారిక లెక్కల ప్రకారమే ఈ సంఖ్య నమోదైంది. యూరప్, దక్షిణ అమెరికా, ఆసియా, ఆఫ్రికా ఖండాల్లో ఏకకాలంలో ఇంత భారీ సంఖ్యలో వీక్షకులను ఆకట్టుకున్న ఏకైక ఈవెంట్ ఇదే.

**రెండో స్థానంలో క్రికెట్ ప్రపంచకప్**

ఫిఫా ప్రపంచకప్ స్థాయిలో కాకపోయినా, అత్యధిక వీక్షకులను సంపాదించుకున్న రెండో అతిపెద్ద ఈవెంట్‌గా క్రికెట్ ప్రపంచకప్ నిలిచింది. 2023లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన ఫైనల్‌ను సుమారు 50 కోట్ల మంది చూశారని ఐసీసీ, దాని అధికారిక ప్రసార భాగస్వాములు అంచనా వేశాయి. ముఖ్యంగా దక్షిణాసియా దేశాల్లోని అపారమైన జనాభా ఈ సంఖ్యకు కారణమైంది. బార్క్ (దీూ=జ) డేటా ప్రకారం కేవలం భారత్‌లోనే డిస్నీ స్టార్ నెట్‌వర్క్‌పై ఈ మ్యాచ్‌కు 422 బిలియన్ల వీక్షణ నిమిషాలు నమోదయ్యాయి.

**ఐపీఎల్, సూపర్ బౌల్ స్థానం ఎక్కడ?**

ఇక, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కేవలం దేశీయ లీగ్‌గా పరిమితం కాలేదు. 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన ఫైనల్‌ను టీవీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో కలిపి దాదాపు 30 కోట్ల మంది వీక్షించారు. ఇది ప్రపంచంలోనే అత్యధికంగా వీక్షించిన టీ20 మ్యాచ్‌గా నిలిచింది.

మరోవైపు 2025లో ఫిలడెల్ఫియా ఈగల్స్, కాన్సాస్ సిటీ చీఫ్స్ మధ్య జరిగిన సూపర్ బౌల్ ఫైనల్ అమెరికన్ టెలివిజన్‌లో రికార్డులు సృష్టించింది. కానీ, ప్రపంచవ్యాప్తంగా దీని వీక్షకుల సంఖ్య 19 కోట్లకు మాత్రమే పరిమితమైంది. ఇందులో 12.7 కోట్లు అమెరికా నుంచే ఉండగా, అంతర్జాతీయ వీక్షకులు 6.2 కోట్లు మాత్రమే. వాణిజ్యపరంగా, ప్రకటనల పరంగా సూపర్ బౌల్ బంగారు గని అయినప్పటికీ, ప్రపంచ ప్రేక్షకాదరణలో మాత్రం ఫుట్‌బాల్, క్రికెట్‌ల కంటే చాలా వెనుకబడి ఉంది.

# ప్రపంచకప్‌లో మ్యాచ్ వదులుకుంటారా?.. గంగూలీ

**టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించిన పాకిస్థాన్**

**పాక్ నిర్ణయం విస్మయానికి గురి చేసిందన్న గంగూలీ**

**ప్రపంచకప్‌లో ప్రతీ పాయింట్ కీలకమని గంగూలీ వ్యాఖ్య**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించాలన్న పాకిస్థాన్ నిర్ణయంపై బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఈ నెల 15న కొలంబో వేదికగా ఈ మ్యాచ్ జరగాల్సి ఉండగా, పాక్ ఈ నిర్ణయం తీసుకోవడం తనను విస్మయానికి గురి చేసిందని ఆయన అన్నాడు.ఆదివారం విలేకరులతో మాట్లాడిన గంగూలీ.. "ప్రపంచకప్ నుంచి ఎందుకు తప్పుకుంటున్నారు? ఎలాగూ వాళ్లు శ్రీలంకలోనే ఆడుతున్నారు. పాకిస్థాన్ ఇలా వెనక్కి తగ్గడం నన్ను ఆశ్చర్యపరిచింది. ప్రపంచకప్ లాంటి టోర్నీలో ప్రతీ పాయింట్ ఎంతో ముఖ్యం" అని స్పష్టం చేశాడు. తటస్థ వేదికపై మ్యాచ్ జరుగుతున్నప్పటికీ పాకిస్థాన్ ఆడకపోవడాన్ని దాదా తప్పుబట్టాడు.ఈ టోర్నమెంట్ కోసం భారత్‌కు వెళ్లకూడదని బంగ్లాదేశ్ తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా, టీమిండియాతో తమ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్.. గ్రూప్-ఏలో ఉంది. ఇదే గ్రూపులో పాకిస్థాన్‌తో పాటు నమీబియా, నెదర్లాండ్స్, యూఎస్ఏ జట్లు కూడా ఉన్నాయి.

# రంగంలోకి దిగిన ఐసీసీ.. భారత్‌తో మ్యాచ్‌పై 24 గంటల్లో పీసీబీ నిర్ణయం

**లాహోర్‌లో ఐసీసీ, పీసీబీ అధికారుల మధ్య 5 గంటలకు పైగా చర్చలు**

**పాక్ ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాతే తుది నిర్ణయం**

**ఈ చర్చల్లో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన బంగ్లాదేశ్**

**ఈ నెల 15న జరగనున్న హై-వోల్టేజ్ మ్యాచ్‌పై వీడని అనిశ్చితి**





**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే ప్రతిపాదనపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తన వైఖరిని రాబోయే 24 గంటల్లో స్పష్టం చేయనున్నట్లు తెలుస్తోంది. లాహోర్‌లో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఉన్నతాధికారులతో పీసీబీ సుదీర్ఘంగా జరిపిన సమావేశం అనంతరం ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ నెల 15న జరగనున్న ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌పై నెలకొన్న అనిశ్చితి ప్రపంచ క్రికెట్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖ్వాజా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాంతో కలిసి పీసీబీ ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ ఐదు గంటలకు పైగా చర్చలు జరిపారు. టోర్నమెంట్‌కే తలమానికమైన మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకోవడంతో సమస్యను త్వరగా పరిష్కరించాలని ఐసీసీ భావిస్తోంది. తుది నిర్ణయం తీసుకునే ముందు తమ దేశ ఫెడరల్ ప్రభుత్వాన్ని సంప్రదించాలని పీసీబీ యోచిస్తున్నట్లు సమాచారం. ఈరోజు నఖ్వీ మీడియా సమావేశంలో మాట్లాడే అవకాశం ఉందని, త్వరలోనే స్పష్టత వస్తుందని

అంచనా వేస్తున్నారు.కొలంబో వేదికగా ఈ నెల 15న భారత్‌తో జరగాల్సిన గ్రూప్ మ్యాచ్ ఆడబోమని ఈ నెల 2న పీసీబీ ప్రకటించడంతో వివాదం మొదలైంది. దీంతో ఐసీసీ రంగంలోకి దిగి అత్యవసరంగా చర్చలు ప్రారంభించింది. ఈ చర్చల్లో బంగ్లాదేశ్ బోర్డు పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చర్చల్లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ ఒకే వైఖరితో ఉన్నాయని ఇండియా టుడే తన కథనంలో పేర్కొంది.టోర్నమెంట్ షెడ్యూల్, పాలన, వాణిజ్యపరమైన ఒప్పందాలపై ప్రభావం పడకుండా చూడటమే ఐసీసీ ప్రధాన లక్ష్యంగా ఉంది. మరోవైపు చర్చల్లోని అంశాలను పీసీబీ ఛైర్మన్ నఖ్వీ, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు వివరించనున్నారు. ఇది కేవలం క్రికెట్‌కే పరిమితమైన అంశం కాదని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

# 3 నెలల తేడా.. రెండు చిత్రాలతో రౌడీ హీరో.. ఫ్యాన్స్ కి పండగే!





విజయ్ దేవరకొండ అభిమానులకు 2026 నిజంగా ఒక మెమొరబుల్ ఇయర్ కాబోతోంది. తనదైన మేనరిజంతో 'రౌడీ హీరో'గా ముద్ర వేయించుకున్న విజయ్, ఈ ఏడాది కేవలం మూడు నెలల వ్యవధిలోనే రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనున్నారు. భిన్నమైన కథా నేపథ్యాలు, క్రేజీ కాంబినేషన్లతో రాబోతున్న ఈ సినిమాల అప్‌డేట్స్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ ఏడాదంతా రౌడీ మేనియా కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.

**'రణబాలి'తో మళ్ళీ టాక్సీవాలా మ్యాజిక్:**

విజయ్ దేవరకొండ మరియు దర్శకుడు రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్లో గతంలో వచ్చిన 'టాక్సీవాలా' ఎంతటి విజయాన్ని అందుకుందో మనందరికీ తెలిసిందే. ఇప్పుడు వీరిద్దరూ కలిసి మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో 'రణబాలి' అనే ప్రతిష్టాత్మక సినిమాతో రాబోతున్నారు. ఈ సినిమాపై అంచనాలు పెరగడానికి మరో ప్రధాన కారణం, ఇందులో విజయ్ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తుండటం. వీరిద్దరి ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీకి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్ మరియు టీజర్ యూట్యూబ్‌లో రికార్డులు సృష్టిస్తూ ఫ్యాన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. పక్కా కమర్షియల్ మరియు ప్యాషనేట్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11న థియేటర్లలో సందడి చేయనుంది.

**'రౌడీ జనార్ధన'.. రవికిరణ్ కోలా డ్రీమ్ ప్రాజెక్ట్:**

సెప్టెంబర్‌లో రణబాలి అల్లరి ముగియకముందే, డిసెంబర్ నెలలో 'రౌడీ జనార్ధన' సినిమాతో విజయ్ మరోసారి థియేటర్లకు రాబోతున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి రవికిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నారు. ఇది రవికిరణ్ కోలాకు ఒక డ్రీమ్ ప్రాజెక్ట్ కావడంతో, ఆయన ఈ సినిమాను ఒక బ్లాక్ బస్టర్ ప్రామిస్‌తో తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్ కూడా పాన్ ఇండియా స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించింది. రణబాలిలో ఒకలా కనిపిస్తే, రౌడీ జనార్ధనలో విజయ్ పూర్తి వైవిధ్యమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఇలా స్వల్ప వ్యవధిలో రెండు విభిన్నమైన పాత్రలతో మెప్పించడం విజయ్ దేవరకొండకే సాధ్యమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

**బాక్సాఫీస్ వద్ద రౌడీ హీరో ప్రభంజనం**

మొత్తానికి 2026లో విజయ్ దేవరకొండ తన సినిమాలతో టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద జాతర చేయబోతున్నారు. మూడు నెలల గ్యాప్‌లో రెండు భారీ ప్రాజెక్టులను రిలీజ్ చేయడం సాహసమే అయినా, ఆ సినిమాల కంటెంట్ మీద ఉన్న నమ్మకంతో చిత్ర యూనిట్ ముందుకు వెళ్తోంది. రాహుల్ సంకృత్యన్ మేకింగ్ స్టైల్, రవికిరణ్ కోలా విజన్.. ఈ రెండూ విజయ్ కెరీర్‌కు మరో మైలురాయిగా నిలిచేలా ఉన్నాయి. సెప్టెంబర్ మరియు డిసెంబర్ నెలలు రౌడీ ఫ్యాన్స్‌కు నిజమైన పండగను తీసుకురాబోతున్నాయి. ఈ రెండు చిత్రాలు విజయవంతమైతే విజయ్ దేవరకొండ పాన్ ఇండియా మార్కెట్ మరో స్థాయికి చేరుకోవడం ఖాయం.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965